

# విశ్వసూక్తము

## విశ్వశాంతి సమైక్యతా శంఖారావం

**సంపుటి : 10** **ఆగష్టు - 2019** **సంచిక : 6**

వ్యవస్థాపక సంపాదకులు : **శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్**

ప్రధాన సంపాదకులు : **శ్రీ కె.వి.ఆర్. సూర్యారావు**

గౌరవ సంపాదకులు : **శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు, శ్రీ యమ్.వి. ఆర్. శాస్త్రి**

సంపాదక వర్గము : **శ్రీ కె. వెంకట శివయ్య, శ్రీ పి.ఆర్. రావు, శ్రీ కె.కె. గుప్త,**

**శ్రీ పి.వి. రమణరావు,** ఆంధ్రభూమి ప్రతినిధి

**ఈ సంచికలో ...**

| | |
|---|---|
| సంపాదకీయం | 6 |
| 16-7-2019 నాడు అట్లాంటాలో జరిగిన గురుపూర్ణిమ ఉత్సవంలో స్వామి దివ్యసందేశం 5-7-2019 నాడు వాషింగ్టన్ డిసి లో తానా సభలో స్వామి దివ్యసందేశం | 8 |
| ఆగష్టు 4 నాడు ప్రపంచ మైత్రి దినముగా జరుపుకుంటున్న సందర్భంలో స్వామి సందేశం | 13 |
| విశ్వయోగి ఉవాచ | 14 |
| కథాసూక్తము | 15 |
| శ్రావణమాస వైశిష్ట్యం | 16 |
| వేదాంతకథాస్రవంతి | 19 |
| శ్రీ వాసుదేవానంద సరస్వతీ (టెంబే స్వామి) సద్గురు చరిత్ర | 20 |
| స్త్రీ సూక్తము | 36 |
| విశ్వహృదయార్చన | 39 |
| ఆత్మబంధువు | 43 |
| ఊహించ వీలుకాని భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయి అద్భుత లీలలు | 48 |
| వార్తలు - విశేషాలు | 49 |
| గీతమంజరి | 50 |

సంవత్సర చందా : రూ. 100/- మాసపత్రిక వెల : రూ. 10/-

Edited, Printed & Published by Sri K.V.R. Surya Rao on behalf
Viswamanava Samaikyata Samsat, Viswamandiram,
3rd Line, Krishnanagar, Guntur - 522 006. (A.P.) INDIA
from G - 2, Orchids, D.D.Colony, Hyderabad - 500 007
and Printed at Sri Lakshmi Graphics, 1-8-436, St No. 10, Chikkadpally,
Hyderabad-500 020. Ph : 040-6666 2976



నా జన్మదిన సందర్భంగా

**భగవాన్**

**శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ వారి**

దివ్యాశీస్సులనర్థిస్తూ

వారి చరణకమలాలకు

వినమ్ర భక్తి పూర్ణ హృదయాలతో

నమస్సుమాంజలులు సమర్పిస్తున్నాను.

**చి॥ ల॥ సౌ॥ మాధురి**

**భర్త : చి॥ మధుబాబు,**

కుమారుడు : **చి॥ విశ్వరిషి,** కుమార్తె : **చి॥ అపురూప**

సియాటిల్, అమెరికా

(ఆగస్ట్ 28, 2019)

# జ్ఞానసూక్తమ్



**విద్యా వినయ సమ్పన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।**
**శుని చైవ శ్వపాకే చ పణ్డితాః సమదర్శినః ॥**

– భగవద్గీత అధ్యాయం 5 శ్లోకం 18

కులం ఏదైనా మానవునికి కావలసినవి విద్య వినయాలు. ఈ సంపద ఏ వ్యక్తి కలిగి ఉంటాడో అతడే నిజమైన బ్రాహ్మణుడు. అతడు జాతి, కుల విచక్షణ పాటించడు. అతని దృష్టిలో గోవు, ఏనుగు, కుక్క మాంసం తినే వ్యక్తులు అందరూ సమానమే. వ్యక్తుల పదవులను బట్టి లేక వారి సంపదను బట్టి కాని, వారి ఔన్నత్యాన్ని అంచనా వేయడు. వారు పండితులా పామరులా అని ఆలోచించడు.

పాఠశాలకు, లేక కళాశాలకు వెళ్ళి ఉపాధ్యాయులు బోధించే విషయాలను తెలుసుకొనడం విద్యగా పరిగణింపబడుతున్నది. అది యథార్థానికి నిజమైన విద్య కానే కాదు. 'విద్యా దదాతి వినయం' భారతదేశపు ఆధ్యాత్మిక చింతనకు మూల సూత్రం. పరబ్రహ్మ స్వరూపులైన గురువులు బోధించే విద్య మనిషికి వినయాన్ని సమకూరుస్తుంది. అర్జునిని మాధ్యమంగా చేసుకొని శ్రీ కృష్ణ పరమాత్మ లోకానికి, లోకులకు గురూపదేశం చేశాడు. ఆ ఉపదేశం శాశ్వతంగా నిలిచి, ఎందరినో ఆధ్యాత్మికపరంగా ప్రభావితం చేస్తున్నది.

సంపాదకీయం

# మనమంతా భారతీయులం

**- పి.వి. రమణరావు**

ఒకే దేశం ... ఒకే చట్టం ... ఈ సూత్రం ప్రపంచంలోని అన్ని దేశాలకూ వర్తిస్తుంది. మనమంతా భారతీయులం అంటూ జమ్మూ కాశ్మీర్ మొదలుకుని కన్యాకుమారి దాకా, గుజరాత్, రాజస్థాన్ మొదలుకుని ఈశాన్య రాష్ట్రాల దాకా ప్రజలంతా మూకుమ్మడిగా గళమెత్తాల్సిన సమయమిది. భారతదేశం చరిత్రను పరిశీలిస్తే ఈ దేశం ఏనాడూ ఇతర దేశాలపైకి యుద్ధానికి పోలేదు. విదేశీయులే భారత్‌పైకి దండెత్తి వచ్చారు. భారతదేశ ఐక్యతను దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తూ వచ్చారు. ఇది కాదనలేని సత్యం. మన దేశం బలంగా ఉంటే ఏ ఇతరదేశం ఇటువైపు కన్నెత్తికూడా చూడలేదు.

ఒకే దేశం ఒకే చట్టం అన్న సూత్రం భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకూ ఇప్పటివరకు సమానంగా వర్తించేది కాదు. మోదీ సర్కార్ తీసుకున్న నిర్ణయంతో ఇప్పుడు వర్తిస్తుంది. భారత్‌లో జమ్మూకాశ్మీర్ ఒక రాష్ట్రం అయినప్పటికీ, ఈ రాష్ట్రానికి 72 ఏళ్ల క్రితం కల్పించిన ప్రత్యేక హోదాతో దేశంలోని ఇతర రాష్ట్రాలకు భిన్నంగా ఉంటూ వచ్చింది. మొన్నటివరకు భారతదేశం మొత్తంలో త్రివర్ణ జాతీయ పతాకం ఎగురవేయగా, జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక పతాకం ఉండేది. భారత్‌లో జమ్మూ కాశ్మీర్ ఒక రాష్ట్రంగా ఉంటూ వస్తున్నప్పటికీ, భారత్‌లోని ఇతర రాష్ట్రాల్లో అమలయ్యే చట్టాలు, జమ్మూ కాశ్మీర్‌కు వర్తించేవి కావు. భారత రాజ్యాంగం జమ్మూ కాశ్మీర్‌కు వర్తించేది కాదు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక రాజ్యాంగం, ప్రత్యేక పతాకం ఉండేవి. దేశంలోని ఇతర రాష్ట్రాల అసెంబ్లీల కాలపరిమితి ఐదేళ్లు ఉండగా, జమ్మూ కాశ్మీర్‌లో ఆరేళ్ల గడువు ఉండేది. అంటే ఒక దేశం రెండు పతాకాలు, రెండు రాజ్యాంగాలు, రెండు చట్టాలూ ఉంటూ వచ్చింది. ఈ తరహా పరిస్థితి ఏ దేశంలోనూ లేదు.

భారతదేశంలో మొన్నటివరకు 29 రాష్ట్రాలు ... ఏడు కేంద్ర పాలిత ప్రాంతాలు ఉండేవి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాల

నేతృత్వంలో కేంద్రం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రాల సంఖ్య 29 నుండి 28కి తగ్గింది అదే సమయంలో కేంద్రపాలిత ప్రాంతాల సంఖ్య 7 నుండి 9కి పెరిగింది. జమ్మూ, కాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పిస్తూ భారత రాజ్యాంగంలో 72 ఏళ్ల క్రితం పొందుపరిచిన 370 ఆర్టికల్‌ను మోదీ ప్రభుత్వం రద్దు చేసింది. అలాగే 35ఏ ఆర్టికల్‌ను కూడా రద్దు చేశారు. జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రానికి రాష్ట్రస్థాయి హోదాను తొలగించి అక్కడ నెలకొని ఉన్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రెండు భాగాలుగా విభజించారు. జమ్మూ మరియు కాశ్మీర్ ఒక కేంద్రపాలిత ప్రాంతంగా ఉంటుంది. అలాగే లడఖ్ ప్రాంతం మరో కేంద్ర పాలిత ప్రాంతంగా ఉంటుంది. జమ్మూ, కాశ్మీర్‌కు ఢిల్లీ, పాండిచ్చేరి తరహాలో శాసనసభ ఉంటుంది. శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యేలు ఐదేళ్లపాటు ఉంటారు. గవర్నర్ ఇక లెఫ్టినెంట్ గవర్నర్‌గా వ్యవహరిస్తారు.

జమ్మూ కాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతం అయినప్పటికీ, అక్కడ శాసనసభ ఉంటుంది. గతంలో ఆరేళ్ల గడువు ఉన్న అసెంబ్లీకి ఇక నుండి అయిదేళ్ల గడువు ఉంటుంది. ఢిల్లీ, పాండిచ్చేరి తరహాలో జమ్మూకాశ్మీర్‌లో పాలన కొనసాగుతుంది. లడఖ్ కేంద్రపాలిత ప్రాంతంలో పరిపాలన చండీగఢ్ తరహాలో కొనసాగుతుంది.

ఇక నుండి భారతీయులంతా గర్వంగా చెప్పుకోవచ్చు. మాది ఒకే దేశం, ఒకే చట్టం, ఒకే పతాకం, ఒకే రాజ్యాంగం అని. అనేక కులాలు, అనేక మతాలు, అనేక భాషలు ఉన్న భారతదేశానికి సనాతనధర్మమే పట్టుగొమ్మగా ఉంది. ఈ దేశ సంస్కృతిని, ఐక్యతను, ధర్మాన్ని కాపాడుకోవాల్సిన తరుణమిదే. ప్రజాస్వామ్య దేశంలో భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. అందులో తప్పులేదు. కాని మొత్తం దేశం విషయానికి వస్తే అందరం ఒక్కటే. భారతీయులంతా ఒక్కటేనని చాటిచెప్పాల్సిన అవసరం ఉంది.

భారతదేశం పటిష్టమైన దేశంగా మారుతుందని, అంతర్జాతీయంగా ఉన్నతస్థానం పొందుతుందని భగవాన్ విశ్వయోగి విశ్వంజీ అనేక పర్యాయలు చెప్పిన విషయం గమనార్హం. ప్రస్తుతం భారతదేశం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోంది.

# 16-7-2019 నాడు అట్లాంటాలో జరిగిన గురుపూర్ణిమ ఉత్సవంలో స్వామి దివ్యసందేశం

దివ్యాత్మ స్వరూపులారా,

నాకు ఇక్కడకు రావడం చాలా ఆనందంగా ఉంది. కొన్ని ముఖ్యమైన విషయాలు మీ దృష్టికి తేవాలనుకుంటున్నాను. జాగ్రత్తగా వినండి. నిన్నటి రోజున (15-7-2019) యువత దినముగా పరిగణించి విశ్వయోగి యువత దినోత్సవము జరుపుకున్నాము. యువతులు, యువకులు పాటలు పాడారు, మాట్లాడారు, విన్యాసాలు చేసారు. ఎందుకు యువత దినోత్సవం జరపమన్నాను. జాగ్రత్తగా మనసు హృదయాలతో వినండి. వాళ్ళని జాగృతం చేయడానికి చేయమన్నాను. మనం యువతని నిర్లక్ష్యం చేస్తున్నాము. వాళ్ళు తల్లిదండ్రులకి, సమాజానికి, పోలీసు డిపార్టుమెంటుకి, ప్రభుత్వానికి సమస్యగా మారుతున్నారు. ఒక దేశం కాదు ప్రపంచమంతటా ఇదే పరిస్థితి. యువత పక్కదారులు పట్టి పోతున్నారు. వాళ్ళని రక్షించాలి, సరియైన మార్గంలో పెట్టాలి, సరియైన శిక్షణ ఇవ్వాలి, వారి మనసులను సక్రమముగా జాగృతం చేయాలి. వారి హృదయంలో ప్రేమను, మనసులో శాంతిని నింపాలి. విద్యాభ్యాసము వైపు వారి దృష్టి మరల్చి తద్వారా వాళ్ళు జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుని జాతిరత్నాలుగా రూపు దిద్దుకుని దేశానికి ప్రపంచానికి సహాయపడేలా చేయాలి.

మనం మన పిల్లలలో గురువును, భగవంతుడుని చూడాలి. క్రితం రాత్రి నేను మిమ్మలని గురుదక్షిణ అడిగాను. మీ పిల్లలని జాతిరత్నాలుగా తీర్చిదిద్ది నాకు ఇమ్మనమని అడిగాను. నాకు అంటే ఈ శరీరం కాదు విశ్వమును సంరక్షిస్తున్నటువంటి, నడిపిస్తున్నటువంటి విశ్వశక్తి. అదే మీరు నాకు సమర్పించే చాలా మంచి కానుక. వాళ్ళు తప్పుమార్గములోకి వెళ్ళకుండా చూడాలి. ఎల్లప్పుడు వాళ్ళు సరియైన మార్గములో ఉండేలా చూడాలి. ప్రపంచం లోని మంచి పిల్లలుగా, దేశంలో మంచి పౌరులుగా, మంచి కొడుకులుగా, మంచి కూతుర్లుగా, కుటుంబంలో మంచి సభ్యులుగా తయారవ్వాలి. వాళ్ళు తమ తల్లితండ్రులను, అమ్మమ్మ తాతయ్యలను, సమాజంలోని అధికారులను అందరిని ప్రేమించాలి. అటువంటి కానుక ఇవ్వడానికి మీరు సిద్ధంగా ఉన్నారా? లేకపోతే

పిల్లలను కనవద్దు. మీరు పిల్లలను కన్నాక వాళ్ళని రత్నాలుగా తీర్చిదిద్ద వలసిన భాధ్యత మీది. ఇది నా ఆదేశం, కోరిక, నాకు ఇచ్చే కానుక ఏమయినా అనుకోండి. సాధారణంగా స్వామీజీలలో ఏ స్వామి కూడా ఇలా మాట్లాడరు. ఈరోజు నేను ఈ అధికారులను స్వయంగా సన్మానించాను. అలా ఏ స్వామీజీ చేయరు. ఈనాటి ఉదయం మీరు ఈ శరీరానికి ఆరాధన చేసారు. ఇప్పుడు నేను ఇక్కడున్న అధికారులలోని దైవశక్తికి ఆరాధన చేసాను. పోలీసు అధికారులు, పోలీసు డిపార్టుమెంటు మీ కుటుంబానికి, దేశానికి రక్షణ కలగజేయడానికి నిజాయితీతో, శ్రద్ధతో, అంకితభావంతో చేస్తున్న సేవలకు మనం వారిని గౌరవించాలి.

ఇండియా నుంచి వచ్చి అనేక దేశాలు సందర్శించి ఆదరణతో ఇక్కడ ఎంతో సేవలు అందిస్తున్న వీరిని మనం గౌరవించాలి, ఆరాధించాలి. నాట్యము, సంగీతముకు సంబంధించిన ఈ గురువు ఇక్కడ అద్భుతమైన సేవలను అందిస్తున్నారు. ఇండియాలో వాటిని మరచిపోతున్నారు. రెండు రోజుల క్రితం అమ్మాయి అద్భుతంగా అరంగేట్రం చేసింది. నేను అట్లాంటా వచ్చి ఆ కార్యక్రమం చూసి ఆమెకు ఆశీస్సులు ఇచ్చాను. ఎందుకని? ఆమె చేస్తున్న సాధన గురించి. సంగీతము, నాట్యము ఇవి లలిత కళలు (fine arts) అంటే వీటిని అభ్యసిస్తే మనం ఫైన్ గా ఉంటాము. ఇక్కడ ఉన్న అబ్బాయిలు, అమ్మాయిలు ఒకరినొకరు ఎలా ఉన్నారు అని పలకరించినప్పుడు ఐయామ్ ఫైన్, వెరీ ఫైన్ అని చెప్తారు. అందుకని మీరు వెరీ ఫైన్ గా ఉండాలనుకుంటే ఫైన్ ఆర్ట్స్ నేర్చుకోవాలి.

మీ మనసులను అసూయ, ద్వేషాలతో నింపకండి. మీరు మానసికంగా, భౌతికంగా శక్తివంతంగా తయారు కావాలి. భౌతిక బలం, మానసిక బలం, ఆర్థిక బలం, సామాజిక బలం, ఆధ్యాత్మిక బలం ఈ ఐదు బలములు ప్రతివారు సంపాదించాలి. పిల్లలు మీరు ఎటువంటి సమయంలో కూడా నిరాశ చెందకూడదు. ఆత్మహత్య గురించిన ఆలోచన ఏ యువకునికి గాని, యువతికి గాని అసలు రాకూడదు. తల్లితండ్రులారా మీరు దాని గురించి ఆలోచిస్తున్నారా? మీరు తప్పకుండా ఆలోచించాలి. నేను చెప్పదలచుకుంటే ప్రపంచంలో, ప్రతి

దేశంలో ఎన్నో కథలున్నాయి. ఒక మెకానిక్‌లాగ వారి మనసులను మరమ్మత్తు చేసి బాగు చేసి, సరియైన మార్గములో పెట్టాను. వాళ్ళు ఇప్పుడు అమెరికాలో, ప్రపంచంలో మంచిపౌరులుగా ఉన్నారు. వాళ్ళు మాదకద్రవ్యాలకు అలవాటుపడి మానసికంగా బలహీనపడ్డారు. నాడీ మండలం దెబ్బతింది. దానికి మందు లేదు. కాని దైవత్వము వలన ఆధ్యాత్మిక యోగులు విశ్వ శ్రీశక్తితో అనుసంధానమై ఆ శక్తిని యువత యొక్క నాడీ మండలంలోనికి ప్రసరింపజేసి వారి మనసులను, దృక్పథమును సరిజేసి, వాళ్ళని రక్షించి సక్రమమైన మార్గములో పెట్టారు. చనిపోయిన తరవాత ఏమవుతాము అనే దానిని గురించి ఆలోచించడం లేదు. స్వర్గమా, నరకమా అని ఆలోచించకండి. ముందు మీ కుటుంబం గురించి ఆలోచించండి. మీ భర్త గురించి గమనించండి, భార్య గురించి గమనించండి. అవసరమయితే హెచ్చరించండి. మీకు హెచ్చరిక చేయడానికి హక్కు ఉంది. ఎలా అయితే సమాజంలో శాంతిభద్రతలు గురించి పోలీసు ఆఫీసరుకి హెచ్చరించడానికి హక్కు ఉందో మీకు అలా ఉంది. అది తప్పు కాదు. మేథావులకు, అంకితభావంతో సేవలు అందిస్తున్న అధికారులకు మనమెంతో ఋణపడి ఉన్నామని ఈ పవిత్రమైన రోజున చెప్పదలచుకున్నాను. వారిలో మనం భగవంతుని, గురువుని చూడాలి. అందుకని వారిని గౌరవించాలి, సత్కరించాలి, ఆరాధించాలి. ప్రతి ఒక్క వ్యక్తిలో ఉన్న దైవికశక్తిని, విశ్వశక్తిని పూజించాలి అది ఈ పవిత్రమైన గురుపూర్ణిమ రోజున చేయాలి.

నేను ఇలా సూర్యోదయం వరకు మాట్లాడగలను. అలసట కలగదు, నిద్రరాదు. మీకు కూడా అలాగే ఉంటుంది. అది 'యోగ' యొక్క గొప్పతనం. యోగ అంటే మీ మనసుని విశ్వమనసుతో, మీ లోని నేను విశ్వంలోని నేనుతో అనుసంధానం చేయడం. అప్పుడు విశ్వశక్తి మీలోకి ప్రసరిస్తుంది. మీరు ఆహారం తీసుకొనక పోయినా జీవించగలరు. అది యోగ గొప్పతనం. మీ పిల్లలకు యోగ నేర్పించండి, ప్రేమించడం నేర్పించండి. ప్రేమ అన్నది ముందు కుటుంబం నుండి మొదలు కావాలి. కుటుంబాన్ని త్యాగం చేయడానికి ఉరకలు వేయకండి. కుటుంబాన్ని పట్టించుకోవద్దు అని నేను ఎన్నడు చెప్పలేదు. గుడికి, చర్చికి వెళ్తూ భర్తని గాని, భార్యని గాని పట్టించుకోకుండా ఉండకూడదు. ముందుగా

నీ భర్తని ప్రేమించు, నీభార్యని ప్రేమించు, నీ పిల్లను ప్రేమించు, నీ తల్లితండ్రులను ప్రేమించు. మీ కుటుంబం శాంతియుతంగా ఉండాలి. మీ ఇంటిని ప్రశాంతి నిలయంగా చేయాలి, మీ ఊరిని ప్రశాంతి నిలయంగా చేయాలి. అప్పుడు ప్రపంచం ప్రశాంతి నిలయంగా మారుతుంది. ప్రపంచంలో శాంతి లేకపోవడానికి కారణం మనం వ్యక్తిని, కుటుంబాన్ని విస్మరిస్తునాము. అటువంటప్పుడు శాంతిని ఎలా సాధించగలం? ఇటుక, సిమెంటుల గురించి ఆలోచించకుండా భవనం కట్టితే అది ఎక్కువ కాలం నిలవదు. అలాగే ముందు వ్యక్తిని శక్తివంతం, శాంతివంతం చేయాలి. మనసు శాంతిగా ఉంటే ప్రతి ఒక్కరు శాంతివంతంగా ఉంటారు, ప్రతి గృహము శాంతివంతగా ఉంటుంది. మనం ఇళ్ళల్లో ఉంటున్నాం కాని గృహములలో కాదు. ఇల్లు అంటే ఉండడానికి కట్టుకున్నది. ఆ ఇంటిని గనక ప్రశాంతి నిలయంగా మార్చగలిగితే అది గృహము అవుతుంది. మీరు అందరు మీ ఇళ్ళను గృహములుగా మార్చుకోవాలని నేను కోరుకుంటున్నాను. అందుకు సిద్ధంగా ఉన్నారా? అది మీరు నాకు ఇవ్వవలసిన రెండవ కానుక.

దేహమే నడిచే దేవాలయం, నడిచే చర్చి, నడిచే మసీదు. భగవంతుని యొక్క నిలయం. శరీరాన్ని శక్తివంతం చేసుకోండి. శరీరం భగవంతుడు మనకు ఇచ్చిన వరం. జీవితం, జ్ఞానం భగవంతుడు మనకు ఇచ్చిన వరాలు. వాటిని మీరు సక్రమముగా ఉపయోగించండి. అదే ఈ పరమ పవిత్రమైన రోజున మీరు నాకు ఇచ్చే కానుక. చి॥అపురూప నా సందేశం విన్నాక మర్నాడు తెల్లవారు ఝూమున 4 గం॥లకు ఈ పాట పాడి వినిపించింది.

ఒకే కుటుంబం ఒకే కుటుంబం
ఒకే కుటుంబం మనమంతా
విశాల హృదయం ప్రశాంతి నిలయం
విశ్వకుటుంబం మనమంతా ॥ ఒకే ॥

మతాలు ఏవైనా, మన కులాలు వేరైనా
జాతులు ఏవైనా, మన రీతులు వేరైనా
మనమంతా మానవులం

మానవత్వమే మన ప్రాణం
మానవత్వమే మనకాధారం. ॥ ఒకే ॥

మనమందరం ఒకే కుటుంబానికి చెందినవారం. మీరు నమ్మినా నమ్మక పోయనా, ఒప్పుకున్నా ఒప్పుకోక పోయినా అది యధార్ధమైన సత్యం. ఈ ప్రపంచంలో భూమిమీద నివసిస్తున్న అందరు ఒకే కుటుంబానికి చెందినవారు. అందరిని ప్రేమించగలిగే విశాలమైన హృదయం కలిగి ఉండాలి. ప్రేమ కుటుంబం నుండి మొదలై విశ్వం వరకు వ్యాపించాలి. స్వార్ధం ఉండకూడదని నేను చెప్పడం లేదు. స్వార్ధమును పెంచుకుంటూ ఇది నా కుటుంబం, ఇది నా ఇల్లు, ఇది నామతం, ఇది నా దేశం, ఇది నా ప్రపంచం అనే స్థాయి వరకు పోవాలి. అది నా సందేశం, నా కోరిక. మనమందరం మానవులం. మానవత్వము అనే ప్రాతిపదికతో అందరు ఏకమై, సమైక్యంగా మీరు నివసిస్తున్న దేశాన్ని ముందు బలపరచడానికి కృషి చేయాలి. అమెరికా, భారత దేశములను మరింత శక్తివంతం కావాలి. ఈ రెండు దేశాలు కృష్ణార్జునులు వలె ప్రపంచంలో శాంతిని నెలకొల్పడానికి ఇంకా ఇంకా సన్నిహితం అయ్యేలా ప్రయత్నించాలి కాని హింస ఆధిపత్యముల గురించి కాదు. మనసు, హృదయముల లాగ ఈ రెండు దేశములు దగ్గరై ప్రపంచంలో శాంతిని తీసుకుని రావడానికి ప్రయత్నించాలి.

మానవా! ఓ మానవా
మానవత్వం మరువకురా ॥ మాన॥

మతముల సారం మానవత్వం
మహనీయుల బోధ మానవత్వం
ప్రగతికి మార్గం మానవత్వం
ప్రశాంతికి మూలం మానవత్వం ॥ మాన ॥

ఇది ప్రపంచం యొక్క హృదయ స్థానమైన భారతమాత యొక్క హృదయ స్పందన. ప్రపంచంలో శాంతి స్థాపనకు దీనిని మొత్తం మానవాళిలో ప్రతి ఒక్క వ్యక్తి హృదయం వద్దకు తీసుకుని వెళ్ళాలి. అందరికి దివ్యమైన ఆశీస్సులు.

# ఆగష్టు 4 నాడు ప్రపంచ మైత్రి దినముగా జరుపుకుంటున్న సందర్భంలో స్వామి సందేశం

ప్రపంచ మైత్రి దినము జరుకుంటున్న అందరికి దివ్యమైన ఆశీస్సులు.

అనేక రకములైన స్నేహములున్నాయి, కాని గురువుతోటి మిత్రత్వము నిత్యమైనది, మిగిలినవన్ని తాత్కాలికము. శ్రీ కృష్ణ సుధాముల మధ్యన, శ్రీకృష్ణా అర్జునుల మధ్యన వున్న స్నేహం మనకు ఆదర్శవంతమైన ఉదాహరణ.

అర్జునుడు శ్రీకృష్ణుని మంచి స్నేహితునిగా భావించాడు కాబట్టి శ్రీకృష్ణుడు అతనిని సరియైన మార్గములో నడిపాడు, సంరక్షించాడు, విజయాన్ని సాధించేలా చేసాడు. ఎక్కడైతే ఆదేశముల నివ్వడానికి శ్రీకృష్ణుడు ఉంటాడో, ఎక్కడైతే ఆదేశములను ఆచరించడానికి అర్జునుడు సిద్ధముగా వుంటాడో అక్కడ సంతోషం, విజయం తప్పక కలుగుతాయి.

గురువు తల్లి, గురువు తండ్రి, గురువు గొప్ప మార్గనిర్దేశకుడు, సలహాదారు, మరియు శుద్ధి కారకుడు.. గురువు నిజంగా గొప్పస్నేహితుడు. ఈ విశ్వంలో ఆదర్శమైన స్నేహము శ్రీకృష్ణుడు అర్జునుడుల మధ్య నున్నటు వంటిది.

నేను మీతో ఉంటున్నాను, నేను మీతోనే ఉంటాను, నేను మీతో ఉన్నాను.

## 'చందాదారులకు గమనిక'

**టెలిఫోను/మొబైలు ఫోను సౌకర్యం ఉన్న చందాదారులు వాటి నెంబర్లను శ్రీ కె.కె.గుప్త (9848414585) గారికి ఫోను చేసి తెలియ పరచవలసింది. లేఖ ద్వారా పి. రామగోపాలరావు, 3-5-1092/2, వెంకటేశ్వర కాలనీ, నారాయణగూడ, హైదరాబాదుకు పంపవలసింది. విశ్వసూక్తము సంచిక ఒకటి కన్న ఎక్కువ అందుతున్నట్లైతే ఆ విషయాన్ని శ్రీ కె.కె. గుప్తా గారికి తెలియ జేయవలసింది.**

## విశ్వయోగి ఉవాచ

# 'భగవంతుని వరప్రసాదమైన విజ్ఞానాన్ని, మేధస్సును, పదవిని సమాజ శ్రేయస్సు కొరకు వినియోగించాలి'

మానవుడు పుట్టుకతోనే జ్ఞానవంతుడు కాదు. వయస్సు పెరిగిన కొలదీ భగవంతుని కృప వలన జ్ఞానాన్ని పొందుతాడు. తత్కారణంగా మేధస్సు వృద్ధి చెంది తను ఆశించిన పదవులను పొందుతాడు. అయితే ఆ జ్ఞానాన్ని, పదవిని స్వప్రయోజనం కొరకు, తన కుటుంబ అభివృద్ధికి కొరకు మాత్రమే ఉపయోగించుకోవడం సాధారణ మానవ లక్షణం. ఇది యథార్థానికి అవలక్షణం. ఈ అవలక్షణాన్ని విడనాడి తన జ్ఞాన సంపదను తోటి మానవుల శ్రేయస్సు కొరకు వినియోగించాలని సద్గురువులైన శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ పైన ఉదహరించిన వాక్యం ద్వారా ఉద్బోధిస్తున్నారు.

మానవులకు జ్ఞానాన్ని బోధించడానికి, వారిని సన్మార్గంలో నడిపించడానికి, కర్తవ్యపాలనను అతిక్రమించకుండా ఉంచడానికి భగవంతుడు గురు రూపంలో అవతరిస్తుంటాడు. అందుకనే 'గురు బ్రహ్మ, గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః, గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః' అని శ్రుతులు తెలియజేస్తున్నాయి.

మహాభారత యుద్ధం ధర్మానికి అధర్మానికి మధ్య జరిగినదిగా భావించాలే తప్ప అన్నదమ్ముల బిడ్డలమధ్య జరగిన పోరాటంగా చూడకూడదు. అర్జునుడు తనవారైన కౌరవులను చూసి యుద్ధం చేయడానికి విముఖత చూపినప్పుడు శ్రీ కృష్ణుడు ధర్మోపదేశం చేసి తిరిగి గాండీవాన్ని పట్టేటట్లు చేసి, ధర్మం గెలిచేటట్లు చేశాడు. ధర్మాచరణలో తన పర బేధం పాటించకూడదు. ధర్మాధర్మ సంఘర్షణలో పలుసార్లు ధర్మ మూర్తులు కూడా అధర్మం వైపు మొగ్గడం జరగవచ్చు. అందుకని ధర్మాన్ని పాటించడంలో ప్రతి వ్యక్తి అత్యంత శ్రద్ధ వహించాలి. ఏ మాత్రం అశ్రద్ధ కలిగినా ధర్మం అపజయం పాలై, అధర్మం విజయాన్ని సాధిస్తుంది. తత్కారణంగా దేశం, సమాజం కష్టనష్టాలకు గురికావచ్చు.

రాజకీయాలలో ఉంటూ దేశ పరిపాలకులుగా ఎదిగిన వ్యక్తులు శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ వారి ఈ సూక్తిని సదా గుర్తుంచుకొని తదనుగుణంగా వ్యవహరించాలి. స్వార్థ చింతన ఎక్కువై ఉన్నత పదవుల కొరకు పడరాని పాట్లు పడుతూ, పై అధికారుల చెప్పు చేతలలో మెలుగుతూ ఉండే వారు ఏదో ఒక నాడు అప్రతిష్ట పాలు కావడం తథ్యం.

## కథాసూక్తము

సంప్రదాయాలను ప్రశ్నించడం ఎందుకు వాటిని పాటిస్తే సరిపోతుంది, దాని వలన నష్టం ఉండదు కదా అన్నారు స్వామి. భార్య భర్తకు ఎడమవైపు కూర్చోవాలి పూజలు, కార్యక్రమాలు చేసినప్పుడు అని చెప్తారు. అలా ఎందుకు కూర్చోవాలి, కూర్చోకపోతే ఏమవుతుంది అని వాదన చేస్తారు కొందరు. కుడివైపు కూర్చుంటే దోషమా అని సందేహం. ఏమీ కాదు, అది ఒక పద్ధతి. హృదయం ఎడమవైపు ఉంటుంది. విష్ణుమూర్తి తన భార్య లక్ష్మీదేవిని హృదయంలో పెట్టుకున్నాడు. అలాగే మీరు మీ భార్యను హృదయంలో పెట్టుకోవాలి కాబట్టి అది తెలియజేయడానికి ఎడమవైపు భార్య కూర్చోవాలి అని సంప్రదాయం ఏర్పరచారు. ఏదైనా మామూలుగా చెప్తే పాటించరు అందుకని ఒక శాసనంగా చెప్పారు. వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి ఆలయానికి వెళ్లినప్పుడు గోవిందా గోవిందా అంటూ వెళ్తాము. అంతేకాని శరణం అయ్యప్పా అంటూ వెళ్ళం. అది అలవాటు. అలవాట్లని, సంప్రదాయాలను గౌరవించాలి.

### గురూపదేశములు

అవధూతకు తేనెటీగ మఱి ఒక గురువయ్యెను. ఆ మధుకరము బహుకాలము తేనెను కూడబెట్టుచుండెను. ఎక్కడనుండియో ఒకడు వచ్చి తేనెపట్టు విదలించి తేనెనంతను త్రాగెను. చిరకాల కష్టార్జితమైన ఫలము ననుభవించుట కా తేనెటీగ నోచుకొనలేదు. దీనిని కనుగొని అవధూత తేనెటీగకు నమస్కరించి యిట్లనెను : 'ఓ మధుకరమా, నీవె నాకు గురుడవు. కూడబెట్టిన ధనమునకు నిజముగ ఏమి గతి సంప్రాప్తించునదియు నీవలన నేను గ్రహించినాడను.'

**- శ్రీ రామకృష్ణ పరమహంస**

# శ్రావణమాస వైశిష్ట్యం

భారతీయ సాంప్రదాయంలో శ్రావణ మాసమునకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఈ నెలలో పండుగలు ఎక్కువగా ఉండుటచేత ఇది పవిత్రమైన నెలగా పరిగణింపబడింది. వివాహాది శుభకార్యక్రమములకు ముహూర్తములు కూడా చాలా ఉంటాయి. దీని పూర్వ మాసమైన ఆషాఢములో పండుగలు, ముహూర్తములు తక్కువగా ఉండుటచేత శ్రావణ మాసమునకు మరింత ప్రాముఖ్యత ఏర్పడింది. మన పంచాంగం ప్రకారం ఇది సంవత్సరములో ఐదవ మాసము. నైఋతి ఋతుపవనాలు రాకతో ముడిపడి ఉండుటచేత భారతదేశ ఉపఖండ ప్రాతం మొత్తానికి శ్రావణమాసం చాలా ముఖ్యమైనది ఈ మాసంలో. సోమ, మంగళ, శుక్ర, శనివారములు చాలా పవిత్రమైనవని భావిస్తారు.

శ్రావణమాసం ప్రార్థన నెలగా అంటారు. ఆ పేరులోనే ఉంది శ్రవణం. శ్రవణం అంటే వినడం అని. ఈ నెలలో భగవంతుని ఆరాధిస్తే వింటాడని నమ్మకం. అభ్యసించడానికి ఈ నెల మంచిదని వేదాధ్యయనం ప్రారంభం చేస్తారు. ఈ మాసము పేరు శ్రీమహావిష్ణువు యొక్క జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రం నుండి ఏర్పడింది. అందుచేతనే విష్ణువు యొక్క భార్య లక్ష్మీదేవికి ఇది చాలా ఇష్టమైన మాసము. బ్రహ్మ శ్రీవిష్ణువును మొదటిసారి శ్రవణ నక్షత్రం ఉన్న రోజున దర్శించుకున్నాడు. ఈ మాసములోనే విష్ణువు గోవిందుడుగా రూపం దాల్చాడు. శ్రవణా నక్షత్రం రోజునాడే వెంకటేశ్వర స్వామి మహాలక్ష్మిని వెతుకుతూ తిరుమలకు చేరుకున్నాడు.

కొత్తగా పెళ్ళైన స్త్రీకి ఇది చాలా ప్రత్యేకమైన మాసము. ఆషాఢమాసం అంతా అత్తవారింటిలో ఉండకుండా శ్రావణంలో తిరిగి వచ్చి మంగళ గౌరీ వ్రతము, వరలక్ష్మీ వ్రతము చేసుకుంటుంది. పాల సముద్ర మథనం దేవతలు దానవులు కలిసి చేసినప్పుడు కాలకూట విషము ఆవిర్భవించింది. దానివలన లోకానికి హాని కలుగుతుందని పార్వతీదేవి అనుమతితో ఆ గరళాన్ని ఈ మాసములోనే శివుడు తన కంఠంలో ఉంచుకుని నీలకంఠుడయ్యాడు. కొత్త

పెళ్ళి కూతురు అత్తవారింటికి వచ్చి మంగళ గౌరి వ్రతము శ్రావణ మాసంలో ప్రారంభించి వరుసగా 5-7 సంవత్సరములు ఆచరిస్తుంది. సజావైన వైవాహిక జీవితం, భర్తయొక్క ఆయురారోగ్యముల గురించి ఆశీస్సులు కోరుతూ గౌరీదేవిని పూజించడమే ఈ వ్రతము. ఈ వ్రతము శ్రావణ మాసంలోని మంగళ వారములలో చేస్తారు. ఈ వ్రతమును శ్రీకృష్ణుడు ద్రౌపదిదేవికి, నారద మహర్షి సావిత్రిదేవికి ఉపదేశించారు. ఈ నెలలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారంనాడు వరలక్ష్మీ వ్రతాన్ని పెళ్ళయిన మహిళలు చేస్తారు. శివుడు పార్వతీదేవికి సూచించి సౌభాగ్యం, మాంగళ్యబలం గురించి తెలియజేసినట్లు చెప్తారు. వరాలిచ్చే దేవత వరలక్ష్మీ వ్రతం వలన భర్తలకు ఆరోగ్యం, పరిపూర్ణ ఆయుష్షు కలుగుతాయని విశ్వాసం. పురాణాల ప్రకారం భక్తురాలు చారుమతిదేవి వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించి అష్టైశ్వర్యాలు పొందింది.

శ్రావణ మాసం చంద్రుని మాసం, చంద్రుడు మనసును ప్రభావితం చేస్తాడు కాబట్టి ఈ మాసంలో మనసుమీద ప్రభావం ఉంటుంది. ఈ మాసంలో రవి సంచరించే నక్షత్రముల ప్రభావము చంద్రుని ద్వారా మన మీద కూడా కలుగుతుంది. చంద్రుని చార నుంచి కలగబోయే దుష్ఫలితాలను నివారించ డానికి, మంచిని కలిగించడానికి ధర్మాచరణములను పండుగగా ఆచరించడం నియమమయింది. మనసు మీద మంచి ప్రభావము ప్రసరించి పరమార్థము వైపు మనసు తిప్పుకొని, మానసికశాంతి పొందడానికి, ప్రకృతి వలన కలిగే అనారోగ్యాల నుండి తప్పించుకుని ఆరోగ్యాన్ని పొందడం కోసం శ్రావణ మాసంలో వచ్చే పండుగలలో నిర్దేశించిన ఆచారాలను పాటించడం ముఖ్య ఉద్దేశ్యమయింది.

శ్రావణ మాసంలో ముఖ్యమైన పండుగలు గరుడ పంచమి. జంధ్యాల పౌర్ణమి(రాఖీ పౌర్ణమి), కృష్ణాష్టమి. శ్రీ మహావిష్ణువు యొక్క వాహనమైన గరుత్మంతుడు తన తల్లిని దాస్యం నుండి విడిపించడానికి ఎంతో కష్టపడ్డాడు. శ్రావణ మాసంలోని 5వ రోజునాడు శక్తి, ధైర్యములను ప్రసాదించమని గరుత్మంతుని పూజిస్తారు. జంధ్యాల పౌర్ణమి నాడు ఉపనయనం చేసుకున్న పురుషులు తాము ధరించిన యజ్ఞోపవీతమును తీసివేసి నూతన

యజ్ఞోపవీతమును ధరించి గాయత్రి జపము చేస్తారు. ఈ పౌర్ణమి నాడు రక్షాబంధనం చేస్తారు. సోదర సోదరీ బంధాన్ని పటిష్టం చేయడానికి ఈ నాడు సోదరుడు తన సోదరికి రాఖీ కట్టి ఆమెకు రక్షణ కలిగిస్తానని ప్రమాణం చేస్తాడు. కృష్ణాష్టమి నాడు కృష్ణుని జన్మదినోత్సవం జరుపుతారు. బాల కృష్ణుని తమ ఇంటిలోనికి ఆహ్వానించగా వస్తాడని నమ్మకంతో చిన్న పాదముద్రలు నేలమీద ఇంటిముంగట వేస్తారు. కృష్ణుడికి వెన్న అంటే ప్రీతియని వెన్నతో ప్రసాదం చేసి నైవేద్యం పెట్టి పంచిపెట్తారు.

శ్రావణ మాసంలో సోమవారం, శనివారాలకు కూడా ప్రాముఖ్యత ఉంది. శ్రావాణ సోమవార వ్రతాన్ని సోమవారాలలో ఆచరిస్తారు. సోమవారం నాడు శివుని పూజిస్తే పవిత్రులవుతామని, శివుని అనుగ్రహం పొందుతామని భక్తుల విశ్వాసం. ఈ రోజు పూర్తిగా ఉపవాసం ఉంటారు కొందరు, ఒక పూట ఉంటారు కొందరు. ఆలయాలలో శివునికి అభిషేకం చేస్తారు. ఈ మాసంలో శనివారాలలో ఇంటి ఇలవేల్పుని పూజిస్తే సకల శుభాలు చేకూరుతా యంటారు. ఉపవాసముండి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆరాధన, గోసేవ చేస్తే తప్పక కోరికలు తీరుతాయంటారు. శ్రావణ బహుళ అమావాస్య నాడు పొలాల అమావాస్యగా జరుపుతారు. రైతులు జరుపుకునే పండుగ ఇది. వ్యవసాయంలో తమకు ఎంతో ఉపయోగపడతాయని ఎద్దులని గౌరవిస్తారు. వాటిని చక్కగా అలంకరించి ఆ రోజు పనిలో పెట్టకుండా ఊరేగిస్తారు. ఇది కొన్ని ప్రాంతాలలో మాత్రం చేస్తారు.

ఈ విధంగా శ్రావణ మాసం భారతీయ సాంప్రదాయంలో చాలా ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

**సేకరణ : సూర్యారావు**

## వేదాంత కథాస్రవంతి

# నమ్మకం యొక్క శక్తి

ఒక ఆమెకు తన గురువు చెప్పిన మాటలయందు చాలా నమ్మకం ఉండేది, ఆయన ఉపదేశాలను అత్యంత శ్రద్ధతో పాటించేది. ఆ విధంగా ఆచరిస్తూ ఆమె కొంత కాలానికి యోగశక్తిని పెంపొందించుకొంది. దానితో కొన్ని సిద్ధులు ఆమెకు సంప్రాప్తమైనాయి. నీటిమీద నడవగలిగే మానవాతీత శక్తి వచ్చింది ఆమెకు. ఆమె గురువు అటువంటి శక్తిని పొందలేకపోయాడు. అందుకని అది ఎలా సాధ్యమయిందని ఆమెను అడిగాడు. దానికి ఆమె ఆయన ఉపదేశించిన మంత్రమును నిష్ఠతో బాహ్యప్రపంచము నుండి విడిపోయి శ్రద్ధతో అనుష్టానం చేయగా ఎటువంటి సమస్యలనైనా అధిగమించగలిగే అనూహ్యమైన శక్తి తనకు సంప్రాప్తించిందని చెప్పింది. గురువు తాను కూడా నీటిమీద నడవడానికి ఆమెను సహాయం చేయమని అడిగాడు. సరేనని ఆమె గురువుతో కలిసి ఒక చెరువు వద్దకు వెళ్ళి ఆమె మంత్రమును ఉచ్ఛరిస్తూ సునాయాసముగా నీటిమీద నడిచింది. అలాగే గురువును చేయమంది ఆమె. ఆయన ఆ విధంగా ప్రయత్నించగా నీటిలోపలకు మునిగిపోవడం జరిగింది కాని నీటిమీద నడవలేక పోయాడు. తాను ఎందుకు చేయలేకపోయాను అని ఆమెను అడిగాడు. మీరు భగవంతుని గురించి కాక నీటిమీద నడవడం గురించి ఆలోచిస్తుండుటచేత మీ నమ్మకం సడలింది. అందుచేత మీకు ఆ శక్తి లభించలేదు అని సమాధాన మిచ్చింది ఆమె.

***(స్వామి సంబుద్ధానంద యొక్క వేదాంత ట్రూ స్టోరీస్ నుండి సేకరణ)***

# శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి

## (టెంబే స్వామి)

## సద్గురు చరిత్ర

## ఇరువదినాలుగవ అధ్యాయము

- శ్రీ జి.వి.ఎల్.ఎన్. విద్యాసాగర శర్మ

(గత సంచిక తరువాయి)

### పన్నెండవ చాతుర్మాస దీక్ష - బ్రహ్మావర్తము (శక.సం॥ 1824)

### దినచర్య

బ్రహ్మావర్తక్షేత్రమునకు చైత్రశుద్ధ త్రయోదశి మధ్యాహ్నము మహారాజ్ వచ్చి చేరుకొనిరి. ఆయన అచ్చుటకు వచ్చుట అది మూడవ పర్యాయము. మహారాజ్ రెండవ చాతుర్మాసము బ్రహ్మావర్తమునందే జరిగినది. తమ ఆరవ చాతుర్మాసము హరిద్వార్‌లో జరిపిన తరువాత, వారు రెండవసారి బ్రహ్మావర్తము పోయి అచ్చటి రామమందిరములో కొంతకాలము నివసించిరి. ఈ పన్నెండవ చాతుర్మాస దీక్షకు వారు మరల బ్రహ్మావర్తము వచ్చిరి. అట్లు మూడు పర్యాయములు వారు బ్రహ్మావర్తమునకు వచ్చుట జరిగినది. వారి పదమూడవ, పదునాలుగవ చాతుర్మాస దీక్షలు కూడా వరుసగా బ్రహ్మావర్తమునందే జరిగెను. శ్రీపాద శ్రీవల్లభులవారు దేశసంచారము చేయుచు, క్షేత్ర మాహాత్మ్యమును బట్టి గోకర్ణమున మూడు సంవత్సరముల కాలము నివసించినట్లు, మహారాజ్ రెండు సంవత్సరముల ఆరు నెలలు బ్రహ్మావర్తమున నివసించిరి. ఇంతటి సుదీర్ఘకాలము వారెచ్చటను సన్న్యాస దీక్షానంతరము మకాము చేసి యుండలేదు. ఇది ఒక విశేషము. అంతాజీపంత్ రేపులో (ఘట్టములో) నున్న రామమందిరములో మహారాజ్ నివసించుచుండిరి. రెండుగదుల నడుమ విరాళ స్థలముతో ఆ రామమందిరము ఇంటి మాదిరిగా, నివాసయోగ్యముగా నుండెను. మహారాజ్ రాక తెలిసి, పూర్వ పరిచితులెల్లరు వారి దర్శనమునకై వచ్చిరి. కుశల ప్రశ్నలైన

తరువాత అందరిని ఆ రోజు నుండి అధ్యయమునకు రమ్మని మహారాజ్ చెప్పిరి. అటుపై మహారాజ్ స్నానము చేసివచ్చి, నిత్యకర్మల ననుష్ఠించి, భిక్షకై వెడలి మూడిండ్ల భిక్ష దెచ్చుకొని స్వీకరించిరి. అంతలో అధ్యయనము కొఱకై బ్రాహ్మణమండలి వచ్చెను. వారివారి కోర్కెల ననుసరించి ఆయా వ్యక్తులకు ఉపనిషత్తులు, భాష్యపంచదశి, జీవన్ముక్తి వివేకము, మనుస్మృతి ఇత్యాది వివిధ గ్రంథములను వారు అధ్యాపనము చేయుచుండిరి. చిన్న పిల్లలకు సంధ్యాది బ్రహ్మకర్మలు, కొన్ని కావ్యములు చెప్పుచుండిరి. వైదికులు వచ్చి పదము, స్వరానుక్రమము వారి దగ్గర నేర్చుకొనెడివారు. కొంతమంది యువకులు యోగాభ్యాసము నేర్చుకొనుచుండిరి. మరికొందరు వైద్యశిక్షణ పొందెడివారు. ఒకనాడు మహారాజ్ పిల్లలకు సమాసచక్రము చెప్పుచుండిరి. ఆ సమయమున **"కృష్ణశ్చ అసౌ సర్పశ్చ కృష్ణసర్పః"** అని చెప్పుచుండగా మహారాజ్ సమాధి స్థితిలోనికి వెళ్ళిరి. ఎవరైనను రోగులు తమవద్దకు వచ్చినచో, వారు ఔషధములను గూడ నిచ్చుచుండిరి. ఈ వ్యయమంతయు వెంకట్రావ్ స్టేషన్‌మాస్టరు భరించుచుండెను. పిశాచబాధ, రోగపీడ మున్నగునవి తొలగుటకై యంత్రము లిచ్చుచుండిరి. మంత్ర తంత్రములు చెప్పి అనుష్ఠానములు చేయించు చుండెడివారు. శకునములు, ప్రశ్నలు, జన్మపత్రికలు మధ్యలో విశ్రాంతి దొరికనప్పుడెల్లను చూచుచుండెడివారు. మధ్యాహ్నము మూడవజాములో శ్రీమద్భాగవత ఏకాదశ స్కందముపై పురాణము చెప్పెడివారు. మహారాజ్ పురాణము చెప్పునప్పుడు సవిస్తరముగా విషయమును గ్రహించవలయునని, నలుగురైదుగురు భాగవత గ్రంథములను చేతబట్టుకొని వినుటకు వచ్చెడివారు. భక్తిజ్ఞాన వైరాగ్యములు లోకులలో నెక్కువగా కలుగవలయు నన్న ఉద్ధేశ్యముతో మహారాజ్ పురాణము చెప్పెడివారు. వారి ప్రవచనము విన్నవారందరును పరమార్ధమార్గ ప్రవర్తకులైరి. సాయంకాలమున మహారాజ్ భక్తమండలి నుండి లేఖలు అందుకొని, వానికి స్వయముగా సమాధానములు వ్రాసి యిచ్చెడివారు.

## జీవన్ముక్త వైరాగ్యస్థితి

ద్వారకకు పోవుచుండగా భిక్ష దొరకనందున మహారాజు ఖర్జూరపండ్లు,

కొబ్బరి తిని కాలక్షేపము చేయవలసి వచ్చినదని లోగడ అధ్యాయములో మనము చదివితిమి. అందుచేత వారికి సంగ్రహణివ్యాధి ప్రబలమయ్యెను. తత్ఫలితముగా వారు శౌచమునకు మాటిమాటికి పోవలసి వచ్చుచుండెను. శౌచమునకు పోయిరాగానే చన్నీళ్ళతో స్నానము చేసెడివారు. శంఖేశ్వర కరవీరమఠము యొక్క పీఠాధిపతి గురుస్వామి, మహారాజ్ సన్నిధిలో కొంతకాలముండిరి. అప్పుడాయన తన కండ్లారా చూచిన విషయమిట్లు చెప్పెను. "బ్రహ్మావర్తములో ఎండాకాలము నందు గంగానది ప్రవాహము, ఘట్టమునుండి చాలా దూరముగా పోయి ఉండెడిది. మహారాజ్ శౌచమునకు పోయివచ్చి, మిట్ట మధ్యాహ్నము సలసల కాగుచున్న వేడి యిసుకలో పాదచారులై ప్రవాహము దగ్గరకు పోయి స్నానముచేసి వచ్చెడివారు. పలుసారులు వారు శౌచమునకు పోవలసి వచ్చుటచే, పలుసారులు వారు స్నానము చేయుటకై ప్రవాహము దగ్గరకు రావలసి వచ్చెడిది. ఆ యిసుక మిట్టమధ్యాహ్న సమయమున చూచుటకు గూడ దుర్భరముగా నుండెడిది. మండు నిప్పులవలె నున్నను, ఆ యిసుకను త్రొక్కికొనుచు రెండుమూడు ఫర్లాంగుల దూరము, వారు పరమశాంతముగా పోయెడివారు. అట్లే తిరిగివచ్చెడివారు. ఆ దృశ్యమును చూచి **"దుఃఖే ష్వనుద్విగ్నమనః సుఖేషు విగతస్పృహః"** అనెడి జీవన్ముక్త వైరాగ్య స్థితిని మహారాజ్ పొందెనని అందరకు తెలియవచ్చినది. బ్రహ్మనిష్ఠతో దేహముమీద నెవరికి ఆసక్తియుండదో, అట్టి మహాత్ముల దర్శన, భాషణ, సాన్నిధ్య లాభములు పరమేశ్వరానుగ్రహము చేతనే లభించి మనము ధన్యులము కాగలము". శ్రీ శంకరాచార్య ప్రేమార్ద్రాంతః కరణముతో ఆ వృత్తాంతమును పలుసారులు ప్రసంగ వశమున ప్రస్తావించు చుండెడివారు. మహారాజ్ ఎన్నడును ఔషధములు సేవించి యుండలేదు. మజ్జిగ మాత్రము పుచ్చుకొనుచుండెడివారు. అసాధ్యమైన శౌచబాధ నిత్యము వారికి కలుగుచున్నను, నడచి ప్రయాణము చేయు కార్యక్రమమున కెట్టి ఆటంకమును కలిగియుండలేదు. రక్తము ఎక్కువగా పడిన సమయములో వారు సంతోషముతో "ఈ రోజు దేహభారము కొంత తగ్గినది" అని చమత్కారముగా పలుకుచుండెడి వారు. పది పదిహేను సారులు అశౌచమునకు పోవలసివచ్చినను వారేమియు విసుగు చెందెడివారుకారు. మహారాజ్ అప్పటి తమ స్థితిగతులను తెలుపుచు

ఒక లేఖ నిట్లు వ్రాసిరి. "బ్రహ్మావర్త్, పౌష్య శుద్ధ ద్వితీయ శక సం॥ 1824 నారాయణ. ద్వారకకు పోవుచుండగా దారిలో ముప్పదిమూడురోజులు భిక్ష దొరకపోవుటచే అక్కడక్కడ కొంతమంది ఇచ్చిన కొబ్బరి, ఖర్జూరపండ్లు తినుటచేత కొన్నిదినములు రక్తము పడెను. సంగ్రహణి వ్యాధితో మూడు సంవత్సరముల కాలము గడచెను. నీరు త్రాగిన ఆ వ్యాధి మరింత ఎక్కువగుచుండెను. ఇది గమనించి మజ్జిగపైననే ఈ మూడు సంవత్సరములు గడిపితిని. పోయిన జ్యేష్ఠశుద్ధ ద్వాదశి రోజు నీరు త్రాగినందులకు వ్యాధి **"భోగా దేవక్షయః కార్యే నాన్యథారబ్ద కర్మణం"** (బోగసువలన కర్మ నశించును. కాని మరొక విధముగా ప్రారంభమైన కర్మగతిని తొలగించుకొనుటకు వీలులేదు). అందుచేత విచారమెందుకు? దేహబుద్ధిచేత ఒకవేళ కనిపించినను **"క్షుధావ్యాధిశ్చ చికిత్సతాం, ప్రతిదినం భిక్షౌషధం, భుజ్యతాం"** అన్నట్లు వేరువిచార మనవసరము. శరీరకష్ట మనుభవించు చున్నప్పుడు భగవంతునిపై మనస్సు స్థిరముగా నిలచునా? యని కొంద రడుగ వచ్చును. స్వల్పోపద్రవముచేత నాటంకము కలిగినను, తుదకు **"శతవృశ్చికదంష్ట్రస్య యా పీడా సానుభూయతే"** యన్నట్లు ఈ ప్రకారము కష్టముల లోపలకూడ "అంత్యకాలే చ మామేవ" ఇత్యాది అనుభవములోనికి ఎట్లు వచ్చును? కనుక మనస్సు దృఢపడుట కిది యొక ప్రయత్నము. తెలియగలరు. నారాయణ". ఈ పత్రతాత్పర్యమును బట్టి చూడగా మహారాజుకు తమదేహాదుల విషయమునందెట్టి ఆసక్తి లేనట్లు మనకు స్పష్టమగును.

వైశాఖమాసము చివర మహారాజ్ పూర్వాశ్రమములోని చిన్నతమ్ముడు సీతారాంభట్ (బాలోబా) మహారాజ్ దర్శనార్థము బ్రహ్మావర్తము వచ్చెను. మహారాజ్ ఆజ్ఞచేత ఆయన గాయత్రీ పునశ్చరణ చేసెను. అచ్చట యుండెడి వెంకటప్ప అనుపేరుగల గృహస్థుడొకడు మహారాజ్‌తో దేనికోతీవ్రముగా వివాదపడెను. మహారాజ్ పరమశాంతచిత్తులై యుండిరి. మహారాజ్ తమ దగ్గరగల చిన్న దత్తవిగ్రహమును రామమందిరములో రామవిగ్రహము దగ్గర యుంచిరి. అచ్చట నిత్యము దానికి పూజ జరుగుచుండెను. ఆషాఢ పౌర్ణమినాడు

గురుపూజ చేసి, శక సం॥1824లో, పంద్రెండవ చాతుర్మాసము బ్రహ్మా వర్తనములో మహారాజ్ పూర్తిచేసిరి.

## నిత్యకార్యక్రమము

ప్రతిదినము వారివారి యిష్టానుసారము ఆయా విషయములను మహారాజ్ బోధించుచుండిరి. ప్రావీణ్యము గడించిన పెద్దవారిచే చిన్నపిల్లలకు విరామ సమయమునందు కీర్తనలు చెప్పించెడివారు. అట్లువారు చెప్పుచున్నప్పుడు మహారాజ్, వారదగ్గర శ్రద్దగా కూర్చుండి ఉత్సాహముతో ఆ విషయములను వినుచు ఆనందము పొందెడివారు. పరిపూర్ణ బ్రహ్మనిష్ట గలవాడు ఇట్టి వ్యవహారములకు సాక్షీభూతుడుగా నుండును. దానిలో నెట్టిలోపమును జరుగనీయడు. దీనికి ప్రబలోదాహరణము మహారాజ్ జీవిత చరిత్రయే ! కీర్తనలలో నున్న పూర్వరంగము, ఆఖ్యానములు, పదములు స్వయముగా తయారుచేసి వారిచ్చెడివారు. బ్రహ్మావర్తములో మహారాజు యొక్క పంద్రెండవ చాతుర్మాస కాలమున, మహారాజ్‌చే సుశిక్షితులైన ఏడెనిమిది మంది కీర్తన (హరికథ), పురాణము చెప్పగల శక్తిని సంపాదించిరి. వారిలో రామచంద్రఖరే, శంకరశాస్త్రి, శిరోళకర్" (ఈయన తదుపరి కొంతకాలమునకు శంఖేశ్వర కరవీరమఠమునకు శంకరాచార్యులైరి.) గోపాల రాజాధ్యక్షుడు మొదలైనవారు గలరు. మహారాజ్ స్వయముగా కొన్ని పదములు, శ్లోకములు, స్తోత్రములు తయారుచేసి పాడుకొనుటకై వారికిచ్చిరి. రామచంద్రఖరే నిత్యము స్నానసంధ్యాది అనుష్టానము లైన తరువాత, మాధుకరము తెచ్చుకొని బ్రహ్మావర్తములో నివసించుచుండెను. ఆయనకు మహారాజ్‌పై అత్యంత పూజ్యభావ ముండెను. మహారాజ్ తాను రచించిన ఆఖ్యానములు, పూర్వరంగములు ఆయనచే పాడించుకొనుచు, విని ఆనందించు చుండెడివారు. **"వాలావలి"** గ్రామస్థుడై, పూర్వాశ్రమములో జయరామశాస్త్రి ఉపాధ్యేయను పేరుగల ప్రజ్ఞానంద సరస్వతి స్వామికూడ, బ్రహ్మావర్తములో మహారాజ్ యొద్ద యుండిరి.

## గోపాల రాజాధ్యక్షుడు

గోపాల రాజాధ్యక్షుడు ఒక గౌడ బ్రాహ్మణుడు. ఆయన రత్నగిరి

ప్రాంతమునకు చెందినవాడు. ఆయన బదరీయాత్రచేసి బ్రహ్మావర్తమునకు వచ్చి, అచ్చట మాధుకరము భిక్ష తీసికొనుచు, దత్తభజన చేయుచు కాలము గడుపుచుండెను. మహారాజ్ యొక్క దిగంత సంక్రాంతమైన కీర్తి ప్రతిష్టలు విని, వారి దర్శన భాగ్యము తనకెప్పుడు లభించునా యని నిత్యము విచారించు చుండెను. వాని పూర్వ పుణ్య విశేషముచేత, మహారాజ్ తమ చాతుర్మాస దీక్షకు బ్రహ్మావర్తమునకు వచ్చుటచే, అతనికి వెదకబోయిన తీగ కాలికి తగిలి బ్రహ్మానందము కలిగెను. మహారాజ్‌ను దర్శించి, అనుక్షణము వారి నంటియుండి వారి సమక్షమునందే తన కాలమునంతయు గడుపుచుండెను. ఒకనాడతడు "నాకు కీర్తన చేయవలయునన్న కోరికయున్నది. నా కోరిక నెరవేరునట్లు దయజూపు"డని మహారాజ్ ఏకాంతముగా నున్న సమయము చూచి, ఆయన దగ్గరకుపోయి ప్రార్థించెను. అర్హత లేకపోయినను మహారాజ్ అనుగ్రహముచే అతని కోరిక పరిపూర్ణముగా నెరవేరెను. అతనిచేత మహారాజ్ కీర్తనలు తయారుచేయించి, ఒక ఏకాదశి పర్వదినమునన ఆ కీర్తనలు చెప్పించిరి. కీర్తనలు చెప్పుట కతడు సంసిద్ధపడి, గొంతు సర్దుకొనుచుండగా "మాధుకరమెత్తుకొను వాడు కీర్తనలేమి చెప్పు"నని లోకులు పెదవి విరచి అవహేళన చేసిరి. కాని అతడు మహారాజ్ యొక్క దివ్యాశీస్సులు పొందినవాడగుటచే పూర్వరంగముగా మొదటి కీర్తన ఆలపించుటకై గొంతెత్తగానే, అందరును ఒక్కసారి ఆ గాత్రమాధురికి ఆశ్చర్య చకితులైరి. ఆ తర్వాత గురుచరిత్ర యందలి కథలను రాజాధ్యక్షుడు ఆఖ్యానములుగా తయారుచేసి, వానిని మహారాజ్‌కు వినిపించి, వానిని కీర్తనలుగా మార్చి చెప్పెడివారు. అట్లతడు కీర్తనలు చెప్పుటలో మిగుల ప్రసిద్ధి వహించెను.

## శంకరరావు కులకర్ణి

నరసోబావాడి దగ్గరగల శిరోళ్ గ్రామనివాసియైన శంకరరావు కులకర్ణికి చిత్రకళ విద్య వచ్చియుండెను. ఇంటిలో స్థితిగతులు బాగుగనే యుండెను. కాని అతనికి సంసార వైరాగ్యము కలిగి, ఉద్యోగము వదిలిపెట్టి, ఏకాంత జీవితము గడుపుచుండెను. ప్రతిదినము జ్ఞానేశ్వరి, దాసబోధ మున్నగు సత్పురుషులు రచించిన గ్రంథములను ఆసక్తితో పఠించుచుండెను. కొన్ని

దినములకు అతడు కాశికి పోయెను. అప్పుడు జ్ఞానేశ్వరి యందలి యోగ నిరూపణము చదివిన వెంటనే యోగాభ్యాసము చేయవలయునను కోరిక కలిగెను. “ఎచ్చటకుపోయి ఎవరి వద్ద నేర్చుకొనవలయు?”నని అతడు ఆలోచించుచుండగా తారక మఠములోని ప్రజ్ఞానంద సరస్వతి “బ్రహ్మావర్తములో వాసుదేవానంద సరస్వతియను మహాయోగి నివసించుచున్నాడు. అచ్చటకు పో” మ్మని సలహా యిచ్చెను. అది విని కులకర్ణి బ్రహ్మావర్తము వచ్చెను. మహారాజ్‌ను దర్శించి, సాష్టాంగ నమస్కారముచేసి తన కోరికను వెల్లడించెను. మహారాజ్ అందుకు సమ్మతించి అతనికి “షట్క్రియులు” నేర్పిరి. తర్వాత అతనితో “వేదాంతము అభ్యసించనిది సత్యానందము దొరకుట కష్టము” అని చెప్పిరి. వేదాంత గ్రంథములన్నియు సంస్కృత భాషలో వ్రాయబడియున్నవి. వానిని చదివి అర్థము చేసికొనుట కష్టము. అందువలన శంకరరావ్ కులకర్ణి మహారాజ్‌ను “నేను మీపాద సన్నిధిలోనే యుండెదను. యోగవిధులన్నియు నాకు నేర్పు”డని వేడుకొనెను. మహారాజ్ అతనిని నారాయణ శాస్త్రి ఎక్ సంబేకర్ యను వానిదగ్గరకు పొమ్మని చెప్పిరి. అతడట్లే సంబేకర్ దగ్గరకు పోయి మహారాజ్ ఆజ్ఞను విన్నవించెను. అతడు తొలుత శంకరరావుచే వేదాధ్యయనము చేయించి, శాస్త్రాభ్యాసము మొదలుపెట్టెను. మహారాజ్ శంకరశాస్త్రికి అభ్యాసములు, వేదాంతములు నిరూపణాను రూపముగా నేర్పిరి. ఆ నేర్చుకొన్న విషయములపై ప్రతి ఏకాదశినాడు శంకరశాస్త్రి కీర్తనలు చేయుచుండెను. పూర్వము మహారాజ్ తాము స్వంతముగా వ్రాసిన బ్రహ్మసూత్ర భాష్య గ్రంథమును కేశవశాస్త్రి జోషియను వానికి ఇచ్చియుండిరి. ఆ గ్రంథమును శంకరశాస్త్రి కిమ్మని మహారాజ్ జోషికి చెప్పియుండిరి. కాని శంకరశాస్త్రితో కలయిక జరుగక పోవుటచే ఆ గ్రంథ మతని కిచ్చుటకు కేశవశాస్త్రి జోషికి వీలు కలుగకపోయెను. అతడా గ్రంథమును నరసోబావాడిలో నున్న దీక్షిత్ మహారాజ్ దగ్గర యుంచెను. ఒకటి ఒకటిన్నర సంవత్సరకాల పర్యంత మా గ్రంథము దీక్షిత్ మహారాజ్ దగ్గరనే యుండెను. తదుపరి కొన్నాళ్ళకు మహారాజ్ వాడిలో మకాము చేసియున్నప్పుడు శంకరశాస్త్రి శృంగేరి మఠమునకుపోయి, అచ్చట న్యాయ వేదాంత శాస్త్రాభ్యాసములు చేసి తిరిగి వచ్చెను. ఆ తర్వాత స్వల్పకాలమునకే అతనికి

జగద్గురు పీఠముపై కూర్చుండెడి యోగమబ్బెను. భవిష్యత్తులో తనకిట్టి యోగము పట్టనున్నదని గ్రహించియే మహారాజ్ సూత్రభాష్య గ్రంథము తన కిప్పించినారని ప్రసంగవశమున అతడప్పుడప్పుడు చెప్పుచుండెడివాడు.

## పర్వదినోత్సవము

బ్రహ్మావర్తములో మహారాజ్ ఉన్నప్పుడు దీపావళి పండుగ వచ్చెను. అప్పుడు దత్తమూర్తి పూజ నిమిత్తము, పంచామృత సహిత పూజద్రవ్యములతో నిండిన ఏబది పళ్ళెములను భక్తులు తీసికొని వచ్చిరి. దత్తమూర్తిని అత్యంత ప్రేమ భావముతో పూజించిన సుగంధ పుష్పములు ఒక పెద్ద రాశిగా పడెను. దత్తమూర్తి చిన్నదగుటచే (కాగల్ గ్రామములో చేయించిన ఆ దత్తమూర్తి ఏడువేళ్ళ ఎత్తున ఉండెను) ఆ పూలరాశిలో మునిగిపోయెడిది. ఆ మూర్తిని లోపలి నుండి తీసి, పూలరాశిపై పెట్టి మరల పూజించెడివారు. అట్లు దత్తమూర్తిని తీసి, పూలరాశిపై పెట్టి పూజించుట ఆ పర్వదినమున మాటిమాటికి జరుగుచుండెడిది. ఉత్సవములో భజనలు, కీర్తనలు, పురాణములు ఇత్యాది బహువిధములుగా జరుగుచుండెను. గ్రామములో అన్ని ఉత్సవములుకన్నను మిన్నగా మహారాజ్ జరిపించిన దత్తమూర్తి ఉత్సవము మిగుల వైభవముగా జరిగెను. అది చూచి మహారాజ్ పై దత్తానుగ్రహము మిక్కుటముగా నున్నదని లోకులకు తెలిసివచ్చెను. వచ్చిన వారందరును దత్తమూర్తికి అతిశ్రద్ధతో పూజలు చేసికొనుచుండిరి. మహారాజ్ అంతఃకరణములో గూడ తన ఉపాస్యదైవ విషయములో ప్రేమ అపరిమితముగా నుండెడిది. అందువలననే దత్తప్రభువు కూడ భక్తవాత్సల్యము ప్రకటించుటకొరకే తన యుత్సవమును శ్రద్ధగా, వైభవముగా జరుగునట్లు చూచుకొనెడివారు. తర్వాత వచ్చిన దత్తజయంతి గూడ అంతకన్నను అధిక వైభవముగా భక్తులు జరుపుకొనిరి. గురుచరిత్ర పారాయణములు, భజనలు, కీర్తనలు మొదలైన అనేక కార్యక్రమములు నిత్యము జరుగుచుండెడివి. శ్రోతలకిట్టి కార్యక్రమములుండుటచేత తిండికి, పడకకు గూడ సమయము చాలకుండెడిది. అందుకై కొందరు మందిరములోనే స్థిరనివాస మేర్పరచుకొనిరి. చివరిరోజు నాలుగ్గైదు వందల మందికి సమారాధన చేసిరి. రాత్రివేళ లాలీత భజన

(పవ్వళింపు సేవ) జరుగుచుండెను. ఆ తర్వాత సంవత్సరము విశ్వేశ్వర మందిరములో ఉత్సవము జరిపిరి.

ఓం నమో శ్రీ గురుదేవదత్త
ఓం శాంతిః శాంతిః శాంతిః.
ఇరువది నాలుగవ అధ్యాయము సంపూర్ణము.

# ఇరువదియైదవ అధ్యయము

## సుబేదార్ వృత్తాంతము

బ్రహ్మావర్తములో సుబేదార్ అనునొక కాణ్వ శాఖీయ గౌరవ కుటుంబీకుడొకడు నివసించుచుండెను. అతడు శ్రీమంతుడు. అతని యింటిలోని అన్నసత్రము లోనికి ఒక పర్యాయము నలుగురైదుగురు బైరాగులు వచ్చిరి. వారు వెడలిపోవునపుడు అక్కడ ఉన్న కట్టెలలో కొన్నింటిని అడుగకుండ తీసికొనిపోయిరి. అందుచేత సుబేదార్ వారిని పట్టి, తెప్పించి జైలులో పెట్టించెను. జైలు శిక్ష అనుభవించి వారు తిరిగిపోవునప్పుడు సుబేదార్ దగ్గరకు వచ్చి "శ్రీమంతుడనన్న గర్వముతో బైరాగులమైన మాపై కొంచెమైనను కనికరము చూపక మమ్ములను బాధించితివి. ఇందుకు ప్రతిఫలముగా ఈశ్వరుడు నిన్ను తప్పక బాధించగల"దని సంతాపముతో శాపము పెట్టి వెడలిపోయిరి. ఆ తరువాత కొన్నాళ్ళకు సుబేదార్ అన్నగారు మరణించిరి. ఒకరోజు అర్థరాత్రివేళలో, ఒక స్త్రీ సుబేదార్ యింటిలోనుండి ఏడ్చుచు గంగాతీరమునకు పోయెను. మహారాజ్ ఆ స్త్రీ యెవరో గ్రహించి, మరునాడు సుబేదార్ అన్న కుమారుడు తన దగ్గరకు రాగానే ఇట్లు చెప్పిరి. "మాధవరావ్ ! నిన్న రాత్రి లక్ష్మి మీ గృహము నుండి ఏడ్చుచు వెడలిపోయినది. కావున ఇకముందు మీరు జాగ్రత్తగా నుండవలయును." మహారాజ్ హెచ్చరిక విని మాధవరావు ఖిన్నుడయ్యెను.

### గోపాలాచార్యుని శిష్యుడు

ఒక సమయమున గ్వాలియర్‌లోని గోపాలాచార్యుని శిష్యుడైన ఒక

శాస్త్రి మహారాజ్ దర్శనార్ధము వచ్చెను. నిత్యప్రమాణముగా మహారాజ్ పురాణము జరుగుచుండగా, మధ్యలో ఆ శాస్త్రి బువా మహారాజ్ చెప్పెడి పలుకులలో వ్యాకరణ విరుద్ధాంశములు కలవని చూపుటకు ప్రయత్నించెను. కాని మహారాజ్ అనేక గ్రంథముల ఆధారములు చూపి, శాంతముగా తాము చేసిన సమాసములు, అర్థములు యోగ్యమగుటలో దోషము లేదని తెలియ చెప్పుటచే అతనికి సమాధానమయ్యెను. తర్వాత నాటిరాత్రి మహారాజ్ ఏకాంతముగా నుండుటను శాస్త్రి బువా చూచి, వారిని సమీపించి ఇట్లు ప్రశ్నించెను. "మహారాజ్ ! మీరు సన్న్యాసాశ్రమములో నుండి కూడా మూర్తి పూజ నెందుకు చేయుచున్నారు? సన్న్యాసులు మూర్తిపూజ చేయవచ్చునని ఏ శాస్త్రములోనున్నది? గాయత్రీజపము చేయవచ్చును. కాని ఈ మూర్తిపూజ యేమిటి?" శాస్త్రి బువా మాటలు విని మహారాజ్ శాంతచిత్తులై ఇట్లనిరి. "నిర్గుణోపాసన నెవరు చేయుదురో వారు తప్పక సగుణోపాసన చేసియే తీరవలెనను విధిలేదు. మన అధికారమెక్కువ యగుటచే మూర్తిపూజ చేయవలసిన అవసరము లేదు. కాని ఈ మూర్తియే నన్ను వదలి పెట్టుటలేదు. మరి నేను పూజ చేయవలయునో లేదో మీరే చెప్పుడు?" మహారాజ్ మాటలు విని శాస్త్రిబువా "మీరీ మూర్తిని వదలిపెట్టుడు. అంతేచాలు" ననెను. మహారాజ్ "మంచిది అటులనే చేసెద"నని అతనిని సమాధాన పరచిరి. మరునాడు మహారాజ్ శాస్త్రిబువాను తీసికొని గంగా తీరమునకు పోయిరి. తమ దగ్గరున్న దత్తమూర్తిని స్నానానంతరము గంగా ప్రవాహములో నుంచి, మహారాజ్ తీరమును జేరునంతలో ఒక విచిత్రము జరిగెను. గంగార్పణము జేసిన ఆ అంగుష్ట ప్రమాణ దత్తమూర్తి మహారాజ్ ముందుకు వచ్చి నిలబడెను. అది చూడగనే శాస్త్రిబువా నిర్గుణోపాసనా హంకారము నిర్మూలమై, సగుణోపాసనపై భక్తి రేకెత్తెను. "నామ దేవాది భక్తుల మాదిరిగనే మహారాజ్ వెంబడి నిత్యము భగవంతుడుండి సంభాషించు"నని ఆయనకు ప్రత్యక్ష నిదర్శనమయ్యెను. మహారాజ్ అద్భుత చరిత్ర నవలోకించగనే జనులందరికి భక్తి ప్రపత్తు లధికతరమాయెను. తర్వాత దశహార సమయమున (గ్రీష్మఋతువులో జ్యేష్ట శుద్ధ పాడ్యమి మొదలు దశమి వరకు జరుగు గంగావతరణ మహోత్సవము) శాస్రిబువాను పురాణము చెప్పుమని మహారాజ్ ఆదేశించిరి. శాస్త్రిబువా మహారాజ్ నివసించుచున్న మందిరమున పురాణము

చెప్పుటకు సంసిద్ధము కాగా, అక్కడ తాము పురాణము చెప్పుచుండుటచే వేరొక మందిరమున చెప్పుమనిరి. కాని అటు పిమ్మట తమ పురాణము ఆపివేసి, శాస్త్రి బువాచే తమ మందిరములోనే పురాణము చెప్పించిరి. ఆయన పురాణము చెప్పుచుండగా తాము శ్రోతలై మహారాజ్ ప్రక్కనే కూర్చుండి యుండిరి. తామచ్చట పురాణము చెప్పుచున్నచో శాస్త్రి బువా పురాణము వినుట కెవ్వరునుపో"రని మహారాజ్ యిట్టి మార్పుచేసిరి. **"సమస్సర్వోప కారః"** అనెడి సాధు పురుషుల లక్షణము మహారాజ్ యెడ సార్థకమయ్యెను. మహారాజ్ చర్య నవలోకించి శాస్త్రిబువా మహారాజ్ యెడ అత్యంత భక్తిగలవాడయ్యెను.

## ప్లేగువ్యాధి

దత్తజయంతి ఉత్సవము పూర్తియైన తరువాత మహారాజ్ ఒక సమయమున ధ్యానస్థులై కూర్చుండియుండగా, ఆ గ్రామములో ప్లేగువ్యాధి ప్రారంభము కాగలదని దృష్టాంతమయ్యెను. కొన్ని పిశాచ సమూహములు యవన రూపములలో వచ్చి, తమ యొడిలో అశుద్ధ పదార్థములు పెట్టుకొని, ఊరి యందంతట చల్లుట మొదలుపెట్టెను. ఆ పిశాచములలో నొకటి మహారాజ్ దగ్గరకు వచ్చి "రేపటినుండి ఈ యూరిలో మానుండి ఉపద్రవము కాగలదు. కావున మీరీయూరు విడచి పోవలసినది." అని చెప్పెను. "ఎవరి ఆజ్ఞానుసారము నేనిచ్చటకు వచ్చితినో వారి ఆజ్ఞ పర్యంతము నేనీ యూరు విడచుటకు వీలులేదు" అని మహారాజ్ చెప్పిరి. మహారాజ్‌కు ఆ పిశాచమునకు మధ్య జరిగిన ఆ సంభాషణ ఆ గ్రామములోని ఒక స్త్రీ విని, ఊరిలోని వారందరికి "భగవంతుని దయ లేకుండటచే ఈ గ్రామములో త్వరలో ప్లేగువ్యాధి రానున్నది. కాబట్టి అందరు గ్రామము విడచిపోవలె"నని చెప్పెను. ఆ మాటలు విని చాలామంది భయముతో గ్రామము వదలిపెట్టి పోయిరి. కొందరు ఎచ్చటకు పోలేక ఆ గ్రామములోనే యుండిరి. ఇంతకు ముందు ఈ అధ్యాయము మొదట పేర్కొనబడిన సుబేదార్ అన్నకొడుకైన మాధవరావు ఇంటియొద్దనే యుండెను. అతనికి ప్లేగువ్యాధి సోకి మరణించెను. ఆ స్థితిలో తన భాగము తనకు రావలెనని అతని భార్య కోర్టులో దావావేసెను. కోర్టు ఖర్చు లెక్కువైనందున డబ్బు చాలక సుబేదార్ చాల కష్టపడవలసి వచ్చెను. బైరాగులిచ్చిన శాపము చేత అతనికట్టి

బాధలు కలిగెను. కలికాలములో గూడ మహాపురుషుల వాక్యములు సత్యములుగా నిలుచును. ప్లేగువ్యాధి ఎవరికి సోకగలదో గ్రహించి ముందుగా మహారాజ్ తెలియజేయు చుండిరి. మహారాజ్ మాటలపై విశ్వాసము లేక ఇల్లువదలి పోనివారు నశించిరి. ఆ తీరుగా పది ఇరువది మంది మరణించిరి. ఒక సమయమున అప్పానిగిడీకర్‌కు ప్లేగు సోకునని మహారాజ్ భవిష్యత్తు చెప్పిరి. అతడు భయపడునని ఖండితముగా చెప్పక, కేవలము సూచనచేసి వదలిరి. మరణ సమయములో ఏయే లక్షణములు కలుగగలవో వానినన్నింటిని సూచించిరి. తదుపరి కొన్నిరోజులకు అప్పానిగిడీకర్‌కు ప్లేగు సోకెను. మహారాజ్ సూచించిన ప్రకారము మృత్యులక్షణములు గోచరించెను. అప్పుడాయన సన్న్యాస దీక్ష తీసికొనవలయునను కోర్కెను మహారాజ్‌కు వెల్లడించెను. అప్పటికప్పుడే మహారాజ్ ఆయనకు ఆతురసన్న్యాస మిచ్చి, పద్మాసనము వేయించి కూర్చుండబెట్టెను. అతనినోటి నుండి మూడు పర్యాయములు ప్రేషోచ్చారము చేయించి, దీర్ఘముగా ఓంకార ప్రణవము చేయించు చుండగనే ఆయన ప్రాణము వదిలెను. ఆయన మరణానంతరము ఒక లేఖద్వార అతని సుగుణములను మహారాజ్ ఈ తీరుగా లేఖమూలముగా తెలియజేసిరి. "పౌష్య వద్య సప్తమి శక సం॥ 1824. నా దగ్గర నాలుగు సంవత్సరములు అప్పా అను కర్ణాటక బ్రాహ్మణుడుండిరి. ఆయన స్మృతిలో నుండగా కోరి, సన్న్యాసము తీసుకొని, మరుక్షణమే మూడుసార్లు ప్రణవనాదము చేసి దేహమును విసర్జించిరి. ఇటువంటి మరణము యోగులకైనను దొరకుట దుస్తరము. నారయణ," అప్పా శరీరము వదలిపెట్టిన సమయములోనే మహారాజ్‌కు కూడా ప్లేగు సోకెను. కాని ప్లేగు వారిపై తన బలము చూపలేకపోయెను. "నేను నా ఉపాస్య దైవము యొక్క ఆజ్ఞలేనిదే గ్రామము విడువ"నని అంతకు పూర్వమే మహారాజ్ సూచించియుండిరి. చేయునదిలేక తుద కారోగము మహారాజ్ వదనము నుండి వెడలిపోయెను. వారు యథాస్థితికి వచ్చిరి.

## సమశ్లోకి గురుచరిత్ర

మహారాజ్ ప్లేగువ్యాధితో నుండగా "సమశ్లోకి గురుచరిత్ర రచించు"మని దత్తప్రభువు ఆజ్ఞాపించెను. ఆ గ్రంథము నేప్రకారముగా రచించవలెనో ఆ

విధానమంతయు దత్తప్రభువు వారికి తెలిపిరి. దత్తప్రభువు సూచించిన విధముగా సమశ్లోకి గురుచరిత్రను ఆరువేల యేడువందల ఏబది (6750) శ్లోకములతో, నలుబది యైదు దినములలో వారు పూర్తిచేసిరి. ఆ గ్రంథ విషయమును గూర్చి మహారాజ్ ఒక లేఖలో నిట్లు తెలిపిరి. "బ్రహ్మావర్త్. చైత్ర వద్య త్రయోదశి. శక సం॥ 1825. బ్రహ్మావర్తములో నుండగా గ్రామములో ప్లేగు ప్రబలినందున గ్రామస్థులందరు ఊరు విడిచి పోయినను కొందరు వృద్ధ బ్రాహ్మణులు మాత్రము ఊరిలోనే యుండిరి. ఆ సమయమున అచ్చట "సమశ్లోక" గ్రంథము రచించుమని ఆదేశమయ్యెను. మరియు అచ్చట చేతితో వ్రాసిన ఒక పురాతన గ్రంథము యాబది యొక్క (51) అధ్యాయములతో కూడినది యుండెను. దానిని సంస్కృతీకరించు మని ఆజ్ఞయయ్యెను. ఇంతటి బృహత్తర కార్యమేతీరున నెరవేరునో, ఎంత సమయము పట్టునో, అని విచారము కలుగగనే మరల సూచనమయ్యెను. అప్పటికప్పుడు పాఠములు సరిచూచుకొను సమయము లేనందున, రోజుకు రెండు వందలు, రెండువందల యాభై శ్లోకములు చేసినచో నెలా నెలాపదిరోజులలో పూర్తికాగలదని భావించి, సుమారు 6750 శ్లోకములు దత్తప్రభువు వ్రాసి చూపించిన విధముగా వ్రాసితిని. ఆ గురుచరిత్రలోని శ్లోకముల సంఖ్య ఎక్కువగుట చూచి "6, 26, 36, 37, 41, 42 అధ్యాయముల నుండి ఓ.వి లను అర్థము చెడకుండ తగ్గించి సమశ్లోకి వ్రాసిన సంఖ్య పూర్తియగును. ఆ తీరుగా చేయమందురా? యని దత్తప్రభువును ప్రార్థించగా అట్లే చేయమని ఆజ్ఞయయ్యెను. ఇకమీదట ఈ గ్రంథములోని శ్లోకముల సంఖ్యను పెంచుటకుగాని, తక్కువ చేయుటకు గాని వీలులేదు. నారాయణ". ఆ గ్రంథ మేవిధముగా పూర్తియైనదో ఆ విషయము గ్రంథాంతమున రెండు శ్లోకములలో మహారాజ్ చెప్పిరి. "ప్రతిదినము నూరు శ్లోకములకన్నను ఎక్కువగా రచించుట జరిగెను. కాని నా రచనా కాలములో ఐదురోజులు మాత్రము రెండువందల కన్న ఎక్కువ శ్లోకము లాయెను". అవి ఆ గ్రంథాంతమున రెండు శ్లోకములలో మహారాజ్ తెలిపిరి. రెండువందల శ్లోకము లొక్కదినముల వ్రాయుటయన్న మాటలా? ఒక ప్రక్కన ఇట్లు శ్లోకములు వ్రాయుచు, మరొక ప్రక్క సంస్కృత భాషాంతరీకరణము చేయుటెట్లు? అదియును గాక నిత్యప్రసంగములు,

కార్యక్రమములు, అనారోగ్యస్థితి మున్నగునవి యున్నను నిరాటంకముగా శ్లోకరచన సాగుచుండెడిది. దీనిని బట్టి మహారాజ్ యొక్క అసాధారణ దివ్యశక్తి ఎంత అమోఘమైనదో మన మూహించుకొనవచ్చును.

## సీతారాంభట్

మహారాజ్ పూర్వాశ్రమములో తమ్ముడైన సీతారాంభట్ (బాలోబా) బ్రహ్మావర్తమునకు వచ్చెను. మహారాజ్ మాణగాంవ్ విడిచినప్పటి నుండి సీతారాంభట్‌కు మహారాజ్‌ను కలసికొనుట అదే ప్రథమ పర్యాయము. ఆ సమయమున మహారాజ్ వ్రాసిన ఒక లేఖలో నిట్లుండెను. "భళా ! ఆయన ఇచ్చట ఐదు నెలలుండిరి. పూర్వ దైవ యోగస్థితి ఇప్పుడీ వీలు కలిగించినది. ఇప్పుడిచ్చట వేదాంత పాఠములు జరుగుచున్నవి. వానితోబాటు శ్రవణము, పఠనము బాగుగా జరుగుచున్నవి. అతనిని పొమ్మనిగాని, యుండుమని గాని ఏమియును దత్తప్రభువు చెప్పలేదు. పడినను పడుగాక ! ఇది మంచిదారి. నిత్యము గంగాస్నాన ఫలము లభించును. నారాయణ". ఈ లేఖ మామూలుగా సీతారాంభట్ సమాచారము కొంత వరకు తెలియవచ్చినది. ఆ సమయమున సీతారాంభట్ మహారాజ్ సలహా ననుసరించి గాయత్రీ పునశ్చరణ చేసెను.

## వెంకట్రావ్ మరణము

బ్రహ్మావర్తములో అప్పాఖాడీకర్ అనునొక బ్రాహ్మణుడు నివసించుచుండెను. ఆయనకు మూలశంఖ వ్యాధిచే రక్తస్రావమగుచు మిగుల నీరసించెను. అతని తల్లికెవరో "నీవు ఐదురకముల పిండివంటలు చేసి, వానితో దిష్టితిసి, ఎవరికైనను పెట్టి తినిపించిన నీ కుమారుని రోగము తగ్గు"నని చెప్పిరి. ఆ ప్రకారముగా అప్పా తల్లి ఆ పిండివంటలు చేసి, దిష్టితీసి వెంకట్రావ్‌ను భిక్షకు పిలిచి ఆ పిండివంటలు పెట్టెను. అతడు వానిని తినగనే అప్పా వ్యాధి నెమ్మదించి క్రమక్రమముగా ఆరోగ్యవంతుడయ్యెను. కాని అప్పా వ్యాధి వెంకట్రావ్‌కు సంక్రమించి అతని ఆరోగ్యము దిన దినమునకు క్షీణించుచుండెను. "నీవా దిష్టితిండి తినుటచేతనే నీకీ దురవస్థ పట్టినది. నీవీ రోగమునుండి కోలు కొందువను నమ్మకము నాకు లేదు" అని మహారాజ్ వెంకట్రావుతో చెప్పిరి. ఆరోగ్యము కలుగుటకై ఎన్నో ఉపచారములను వెంకట్రావ్ చేసికొనెను. కాని

ఫలితము లేకపోయెను. తుదకు ఆయాసమెక్కువై అతడు మరణించెను. అప్పానిగిడీకర్ మరియు వెంకట్రావ్ స్టేషన్ మాస్టరు ఇద్దరును మహారాజ్ ఆజ్ఞ నుల్లంఘించి, పూర్వము మహారాజ్‌ను వెంబడించి వచ్చుట చేత ఇరువురకు మరణములు సంభవించెను. బ్రహ్మావర్తములో మహారాజ్ "లఘు మననసారము" అను పేరుగల వేదాంత గ్రంథమును కూడా రచించిరి.

## మాణగాంవ్‌లో టెంబే వంశమువారు లేకుండుటకు కారణము

మహారాజ్ పూర్వాశ్రమములో రెండవ తమ్ముడైన హరిభట్ (దత్తోబా) బ్రహ్మావర్తమునకు మహారాజ్‌ను దర్శింపవచ్చెను. అతడు రాకమునుపే సీతారాంభట్ వచ్చి యుండెను. హరిభట్టు ద్వారా మాతృశ్రీ నిర్యాణవార్త తెలియగనే మహారాజ్ శుద్ధిస్నానము చేసిరి. వైశాఖ శుద్ధ తృతీయ శనివారము శక సం॥ 1824 నాడు మహారాజ్ తల్లిగారి నిర్యాణదినమై యుండెను. హరిభట్ వచ్చిన తరువాత మహారాజ్ వారితో నిట్లు చెప్పెను. "మీ దగ్గరకు వచ్చిన కోనకర్ చేసిన దోషమునకు భగవంతుడు శపించెను. కనుక వాని మీది మమకారము వదిలిపెట్టుడు. అదేవిధముగా తల్లిగారి మరణముతో అక్కడి పుణ్యమంతయు (దైవానుగ్రహము) నశించెను. అందుచేత మీకు మాణగాం వ్‌లో నేదియు మిగులదు" మహారాజ్ చెప్పిన ప్రకారమే జరిగెను. ఈ సమయముననే మహారాజ్ హరిభట్టును జీవిత పర్యంతము గంగాతీరమున నివసించుమని చెప్పిరి. కాని అతడు వినలేదు. మాణగాంవ్‌లోని సంపాదన కోరికను వదలలేక పోవుట వలన టెంబే వంశము వారచ్చట యుండుటకు వీలు లేకపోయెను.

## నవ సప్తాహములు

కొన్నిరోజులకు బ్రహ్మావర్తములో ప్లేగువ్యాధి తిరుగుముఖము పట్టెను. చైత్రమాసము నుండి జనులు గ్రామములోనికి తిరిగి వచ్చి నివసించుట మొదలు పెట్టిరి. మూడునెలలు ప్రవాసములో నుండి గ్రామస్థులు తిరిగివచ్చి నివసించుట మొదలు పెట్టగనే గ్రామమునకు కళ వచ్చెను. పూర్వము మాదిరిగా కార్యక్రమములన్నియు జరుగుచుండెను. "ప్లేగు నివారణ కొరకు హరిభజనలు దివ్యౌషధ"మని మహారాజ్ చెప్పుటచే భజన సప్తాహములు మొదలు పెట్టిరి.

రాత్రింబగళ్ళు అందరును భజనలు చేయుచుండిరి. మహారాజ్ యొక్క దివ్యసామర్థ్య ప్రభావము చూచి, సుబేదార్ వంటి సంపన్నులు భజనలు, ఉత్సవములు జరుగుటకై విరాళము లొసగుచుండిరి. ఆ ప్రకారము అఖండముగా ఏడు సప్తాహములు జరిగినవి. మహారాజ్ సూచించిన నామమంత్రములతో ఆ సప్తాహములు జరిగెను. మొదటి సప్తాహము – “శివశంకర గౌరీశంకర” అను నామముతో, రెండవ సప్తాహము – **“హరేరామ హరేరామ రామ రామ హరేహరే హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే”** అను నామముతో, మూడవ సప్తాహము – **“శ్రీపాద శ్రీ నరసింహస్వామీ శ్రీమద్దత్తాత్రేయ మౌనీ”** అను నామమంత్రముతో, నాలుగవ సప్తాహము – **“గణేశ గౌరీహరనందన విఘ్న వినాశన గజానన”** అను నామముతో, ఐదవ సప్తాహము – **“హరి హర గణపతి భాస్కర శక్తిస్వరూప ఈశో వరదో జయతి”** అను నామమంత్రముతో ఆరవ సప్తాహము – **“జయ పురుషోత్తమ శరణద సత్తమ”** అను నామ మంత్రముతో, ఏడవ సప్తాహము – “శివ హర శంకర గౌరీ శంకర” అను నామ మంత్రముతో జరిగెను. ఈ తీరుగా ఏడు సప్తాహములు జరిగిన తర్వాత **“దిగంబరా దిగంబరా శ్రీపాద వల్లభ దిగంబరా”** అను నామ మంత్రముతో సప్తాహము చేసిరి. ఇకముందు రాబోవు దశహరము కొఱకు, బాగీరథీ ప్రీత్యర్థము మరియొక సప్తాహము చేసిరి. **“బాగీరథీ జయ పావనగంగే జాహ్నవి తారయ పాతకభంగే”** అను నామ మంత్రముతో ఆ సప్తాహము జరిగెను. ఇట్లు తొమ్మిది సప్తాహములు జరిపిరి. ప్రతి సప్తాహము చివర “ముక్తిద్వార బ్రాహ్మణ భోజనము” జరుగుచుండెడిది. బ్రాహ్మణేతరులకు కూడ అన్నదానము జరిగెను. ఆషాడ పౌర్ణమినాడు వ్యాసపూజ చేసి శక సం॥ 1825లో చాతుర్మాస దీక్ష మరల వారు బ్రహ్మావర్తములోనే చేసిరి.

ఓం నమో శ్రీదత్తాత్రేయాయ

ఓం శాంతిః శాంతిః శాంతిః.

ఇరువదియైదవ అధ్యాయము సంపూర్ణము.

(సశేషం)

## స్త్రీ సూక్తము

# కుమ్మరి మొల్ల

కుమ్మరి మొల్ల పేరు వినగానే మనకు గుర్తుకొచ్చేది మొల్ల రామాయణం. సంస్కృతంలోని రామాయణాన్ని తెలుగులోకి అనువాదం చేసినటువంటి మహిళా కవయిత్రి. ప్రాచుర్యం పొందిన కవయిత్రులలో మొదటగా తాళ్ళపాక అన్నమాచార్య సతీమణి శ్రీమతి తాళ్ళపాక తిమ్మక్క, రెండవ కవయిత్రి మొల్ల. ఈమె కుమ్మరి వంశమునకు చెందిన శ్రీ ఆతుకూరి కేశన శెట్టి యొక్క కుమార్తె. ఆంధ్రప్రదేశ్ లోని కడప పట్టణముకు ఉత్తరము వైపు సుమారు 60 కిలోమీటర్ల దూరంలో వున్న బద్వేల్ పట్టణమునకు సమీపములో ఉన్న గోపవరం గ్రామంలో నివాసముగా ఉండెడివారు. ఆమెను మొల్లమాంబ అని కూడా అంటారు. మొల్ల అనగా సువాసన భరితమైన మల్లెపూవు అని అర్థం. ఆమె ఉన్న గ్రామమే కాక చుట్టుప్రక్కల గ్రామములలో కూడా చాలా ప్రఖ్యాతి గాంచింది. సహజంగా సరళ స్వభావం కలిగిన మహిళ. అందరితోను ప్రేమతో, దయతో వ్యవహరించేది.

అనేక తరాల నుండి మొల్ల యొక్క పూర్వీకులు శివభక్తులు. ఆ విధంగానే ఆమె తల్లిదండ్రులు కూడా గొప్ప శివభక్తులు. వారు శ్రీశైలములోని మల్లిఖార్జునుడు, భ్రమరాంబలను ఆరాధించేవారు. అటువంటి శైవసాంప్రదాయ కుటుంబంలో జన్మించిన ఆమెకు మహావిష్ణువు యొక్క అవతారమైన శ్రీరాముడు అంటే ఎంతో ఆరాధనా భావం ఉండేది. అందరిలాగ ఆమె బాల్యంలో సాంప్రదాయంగా పాఠశాలలో విద్యాభ్యాసం చేయలేదు, గురువు వద్ద శిక్షణ పొందలేదు. మహాదేవుని యొక్క వరముగా ఆమెకు పాండిత్యము సహజసిద్ధంగా లభించింది. పరమేశ్వరుని ఆమె గురువుగా భావించింది. భాగవతమును ఆంధ్రీకరించిన శ్రీ బమ్మెర పోతన ఆమెకు ప్రేరణ అయినాడు. శివగాథ అయినటువంటి వీరభద్ర విజయమును రచించిన పోతన విష్ణుకథ భాగవతమును తెలుగులో అనువదించిన విధముగానే శైవారాధనలో జీవనం గడుపుతున్న మొల్ల సంస్కృతములోని రామాయణమును తెలుగులో అనువ

దించింది. ఆ కావ్యం చాలా ప్రాచుర్యాన్ని పొందింది. ఆ రోజులలో కవులు అనుసరించే పద్ధతి ప్రకారముగా ఆమె తన రామాయణ కావ్యమును ఏ రాజుకు అంకితము చేయుటకు నిరాకరించింది.

మొల్ల రామాయణం సరళమైన తెలుగులో సులభమైన శైలిలో ఎక్కువ సంస్కృత పదములు లేకుండా ఉండుటచేత బహుళ ప్రజాదరణ పొందింది. సుమారు 870 పద్యములు కొంత వచనము కలిగి ఉన్నటువంటిది. సామాన్య ప్రజల జీవనవిధానం, వారి అలవాట్లు, పొరపాట్లు, కష్టాలు, సుఖాలు, జయాపజయాలకు సంబంధించిన విషయములను విశదీకరించడం జరిగింది. గొప్పపండితులు, ప్రతిభావంతులు అయిన కవులు వలె ఆమె సాహిత్య ప్రతిభ అమూల్యమైనది, విశిష్టమైనది అని, అప్పటి పండితులు కొనియాడారు. ఆమె శ్రీకృష్ణదేవరాయలు వారి ఆహ్వానం మేరకు వారి ఆస్థానంలో తన రామాయణ కావ్యం చదివి వినిపించి అందరిని ఆనందాబ్ధిలో ముంచెత్తినది. తెలుగులో వచ్చిన రామాయణములలో మొల్ల రామాయణం సులభముగా అర్థమయ్యే పద్ధతిలో రచింపబడింది. ఆమె వినయవంతురాలు. రామాయణమును అంతకు పూర్వం రచించిన కవులందరిని తన కావ్యంలో ప్రశంసించింది. ఆమె కావ్యంలో మొదటి పద్యంలో రామాయణం యొక్క విశిష్టత, అమరత్వము గురించి ప్రస్తావించింది.' ఆహారం ప్రతిరోజు తీసుకుంటున్నామని ఎవరైనా ఆహారం తీసుకోవడం మానుతారా! అలాగే రామాయణము కూడా. ఎవరైనా వ్రాయచ్చు, ఎన్ని పర్యాయములు వీలగునో అన్నిమార్లు చదువవచ్చు, అభిమానించవచ్చు. ఏ రచన అయినా చదువుతున్నప్పుడు వెంటనే అర్థంకాని పదములతో నిండి వుంటే అది చెవిటివాడు మూగవాడుల మధ్య సంభాషణలా ఉంటుంది. అనగా కావ్యము చదివేవారికి నిఘంటువుల సహాయము గాని, పండితుల సంప్రందింపులు గాని అవసరము లేకుండా సులభంగా అర్థము కావాలి. నాలుక మీద తేనెబొట్టు పడగానే ఆ మధురిమ తెలిసినట్లుగా పద్య రచన ఉండాలి. ఆమె తన రచనలో మూలకథకు కొన్ని సంఘటనలను కల్పన చేసి జోడించింది, కొన్నిచోట్ల మూలకథలోని కొన్ని భాగములను తీసివేసింది. చాలామంది పండితులు ఈ విధముగా మార్పులు చేయడము కథావస్తువుకు

మరింత పటుత్వాన్ని కలుగజేస్తుందని సమర్థించారు. ఆమె పాండిత్యప్రకర్షణను చక్రవర్తి సముఖంలో పరీక్షించదలచి పండితులు ఆమెను భాగవతంలోని గజేంద్రుడు తనకన్న శక్తివంతమైన మొసలి బారినుండి రక్షింపబడిన విధానమును రెండు పద్యములలో ఛందోబద్ధంగా ఒక నిముషములో ఆశువుగా చెప్పమన్నారు. అప్పుడు ఆమె శ్రీరాముని ప్రార్థించి ఆశువుగా రెండు పద్యములు పండితులు అడిగిన ప్రకారము చెప్పింది. ఆమె పాండిత్యపటిమకు అందరు ఆశ్చర్య చకితులయినారు. అప్పుడు ఆమెకు 'కవిరత్న' అని బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.

మొల్ల తన రామాయణ కావ్యమును శ్రీశైల మల్లిఖార్జునుని అంకితమిచ్చింది. తన గ్రామవాసుల వద్ద సెలవుతీసుకుని శేషజీవితమును శ్రీశైలంలో గడుపుటకు నిశ్చయించుకుని అక్కడకు చేరుకుంది. తన చరమదశలో భగవంతుడు గురించి తెలుసుకోవాలి అనే జిజ్ఞాసతో ఆమెను కలుసుకునే భక్తులకు అనేక విషయములు బోధించింది. ఆమె సుమారు 90 సంవత్సరాలు (1440-1530) జీవించి మహాసమాధి పొందింది. భౌతికంగా ఆమె నిష్క్రమించినా ఆమె జీవితం రాబోయే కాలములలో కూడా ఒక ఉదాహరణగా నిలిచిపోతుంది.

ఆతుకూరి (కుమ్మరి) మొల్ల యొక్క సాహితీప్రజ్ఞకు గుర్తింపుగా భారత ప్రభుత్వము 5 రూపాయల తపాలా బిళ్ళను 26 ఏప్రిల్, 2017 సంవత్సరములో విడుదల చేసింది. కడప పట్టణములో ఆమె విగ్రహమును ఒక కూడలిలో ప్రతిష్టించారు. ఆమె రచించిన రామాయణము జనబాహుళ్యములోఅత్యంత ప్రాభవము సంతరించుకున్నందున ఆమె పేరు చిరకాలము నిలిచిపోతుంది.

**సేకరణ : సూర్యారావు**

# విశ్వహృదయార్చన

(గత సంచిక తరువాయి)

"మానవునికి తాను ఎక్కడ నుండి వచ్చాడో ఎక్కడికి వెడుతున్నాడో, ఏమి తెలియటం లేదు. "ఎచట పుట్టెనచ్చట కేగుట నైజము ప్రాణ కోటికిన్" తాను ఎక్కడి నుండి వచ్చాడో అక్కడి కే పోయి చేరి పోవాలి. ఈ సత్యాన్ని మొట్టమొదట గుర్తించి దైవత్వాన్ని విశ్వసించాలి. మానవుడు పుట్టినప్పటి నుండి ఏవో విషయ వాంఛల చేత సంకుచితమైన భావముల చేత పెడమార్గం పడుతున్న తరుణమిది. పుట్టడం, పెరగడం, తినటం,జీవించడం, నశించడం, ఇదే జీవిత పరమావధి కాదు. ఈ కర్మలన్నీ పశుపక్ష్యాదులు కూడా చేస్తున్నాయి. ఇంక "జంతూనాం నరజన్మ దుర్లభం" అని చెప్పటంలో నున్న విశేషాన్ని గుర్తించాలి. మానవత్వానికి పశుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని తెలుసుకోవాలి. "జ్ఞానం న రాణాం అధికం విశేషః జ్ఞానేన శూన్యః పశుభిస్సమానః" ఈ నాటి మానవుని యందు లౌకిక జ్ఞానం పెరిగిపోయి, నైతిక జ్ఞానం క్షీణిస్తున్నది. అందుచేత ప్రజ్ఞానం రమ్మంటే ఏవిధంగానూ రావటానికవకాశం లేదు. ప్రజ్ఞాన, సుజ్ఞానములను చక్కగా గుర్తించినప్పుడే జీవితం యొక్క రహస్యాన్ని గ్రహించగలడు. ప్రతి మానవుడు తాను ఏ విత్తనము నుంచి వచ్చాడో గుర్తించాలి. "బీజం మాం సర్వ భూతానాం" అన్నాడు కృష్ణ పరమాత్మ. తానే బీజంగా ఉంటున్నానన్నాడు. అదియే ఆత్మ స్వరూపము. "అంతరంగమున ఆత్మ రూపము నీవు" అంటూ రచయిత. వేరొక చోట మరొక పద్యపాదంలో సెలవిచ్చారు. ఇట్టి అంతర్భూతమైన ఆత్మ స్వరూపాన్ని గుర్తించక బహిర్ముఖమైన రూపనామములనే ఆధారం చేసుకొని కాలమును వ్యర్థం చేసుకోవడం తగదు" అని బాబా కొడైకెనాల్‌లో 1999 సంవత్సరము మే నెల 3వ తేదీ చేసిన దివ్యోపన్యాసంతో సెలవిచ్చినారు.

అందుచేత కర్మ ద్వారా భక్తిని పెంపొందించుకుంటూ అమితంగా సత్కర్మాచరణ చేస్తూ భక్తి భావాన్ని మనసున చేర్చి శరణాగతి స్థితిలో భగవదర్పితంగా కర్మల నాచరిస్తే జ్ఞానం కలుగుతుందన్న భావం ఈ పద్యంలో

గోచరిస్తోంది. "శ్రద్ధవాన్ లభతే జ్ఞానం" అన్నాడు పరమాత్మ. భగవంతుని పట్ల అనురక్తియే భక్తి గనుక, అటువంటి భక్తి భావం పెంపొందించుకుంటూ శ్రద్ధతో కర్మలాచరిస్తే జ్ఞానం ప్రాప్తిస్తుంది. మనసు శుద్ధి చేయగలిగేది కర్మయేనంటూ ప్రథమపాదంలోనే విశ్వంజీ సెలవిచ్చారు. అందుచేత కర్మద్వారా భక్తి, భక్తి ద్వారా జ్ఞానం కలుగుతాయని భావము. అందుచేతనే భగవద్గీతలో భక్తి జ్ఞాన కర్మ మార్గాలు మూడు చెప్పబడినవి.

**బోధలెన్ని సాయి బోధింపజేసినా**
**చిత్తశుద్ధిలేక చిక్కబోడు**
**కర్మచేత కర్మ కరగియే తీరురా!**
**శాంతి ప్రేమదాయి! సత్యసాయి!** (శాం॥ప్రే॥60)

సత్యసాయి బాబావారు తాము అవతరించిన నాటి నుండి బాల్యం గడచి "నేను సాయిని తెలియుము" అని ప్రకటించకముందే అనేకానేక లీలలు ప్రదర్శించినట్లు వారి చరిత్ర వివరించినది. చిన్ననాటి లీలలు, లీలలుగా భావించక, మానసికమైన రుగ్మతయని ఉన్మత్త స్థితి యని భావించి భూతవైద్యుల చేత మందులిప్పించారు. ఇది అజ్ఞానంగా భావించే వారు లేకపోలేదు. ఈ బాలుడిలో నిండి నిబిడీకృతమై యున్న మహాశక్తిని ఇంటిలో తాతగారైన కొండమరాజుగారు గుర్తించారు. కరణం సుబ్బమ్మ, మరికొందరు ఉపాధ్యాయులు ఈ సత్యం అని పిలువబడే బాలుడి భక్తి ఎటువంటిదో తెలుసుకొన్నారు తప్ప, మిగిలిన వారందరు అజ్ఞానం వలన అర్థంకాని అయోమయ స్థితిలో మునిగిపోయి దుష్టమైన చర్యల నారంభించడమేకాక కక్షలు, కార్పణ్యాలతో, అసూయతో చంపడానికి సిద్దపడి చివరకు ఆ బాలుడిలోనున్న దివ్యత్వాన్ని గుర్తించి పశ్చాత్తాపంతో దాసోహమ్మని క్షమార్పణ కోరుకొన్నవారూ ఉన్నారు. సమయమాసన్నమైనప్పుడే వారి దివ్యత్త్వం అర్థమయింది. జన్మాంతర సంస్కారం వలన కొందరు ఉపాధ్యాయులు, కరణం సుబ్బమ్మ వంటి సేవాభావం గల వ్యక్తులు మాత్రం చిన్న బాలుడిగానున్నప్పుడే ఆ దివ్యశక్తిని గుర్తించి ధన్యాత్ములైనారు.

కొన్ని సంవత్సరాలు బాబా లీలా కాండ కొనసాగింది. తదుపరి మరికొన్ని సంవత్సరాలు మహిమలు ప్రదర్శించారు. పలువురు ఆకర్షితులయినారు. తదుపరి బోధాకాండ కొనసాగింది. ఆ బోధామృతాన్ని తనివితీరా ఆస్వాదించి, ఆచరణలో పెట్టిన భక్తులెందరెందరో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ బాబా ఆదేశాలు తూ॥చా॥ తప్పక పాటిస్తూ చిత్తశుద్ధితో మెలగిన వారి సంఖ్య నానాటికీ పెరుగుతూ వచ్చింది. ఆయన ఎన్ని బోధించినా చిత్తశుద్ధి లేకపోతే కించెత్తయినా ఆయన దివ్యత్త్వం అర్ధంకాదు. కొంతైనా వారి తత్త్వాన్ని అర్థం చేసుకొని గ్రహించి వారి ప్రణాళికలన్నీ కార్యరూపం దాల్చే కార్యక్రమానికి కొంతైనా దోహదం చేసిన వారవుతారు. ఆయన చిక్కాలంటే చిత్తశుద్ది కావాలి. మనసా, వాచా, కర్మణా త్రికరణ శుద్ధితో నిష్కామ కర్మ లాచరిస్తే తప్ప ఆయన చిక్కడు. ఎంత భక్తి భావం ఉండాలో! ఎంతటి ఆర్తి ఆర్ద్రత తో మెలగాలో ! తదేక ధ్యాసతో ధ్యానం చెయ్యాలో మరి! ఇవన్నీ విశ్వయోగి విశ్వంజీ చేశారు. వారి దయను పరిపూర్ణంగా పొందారు. వారి కరుణా స్వభావాన్ని అర్థం చేసుకున్నారు. హృదయాన్నే పూజాపుష్పంగా అర్పించారు. “దయగల హృదయమే దైవమందిర” మన్నారు ఈ సద్గురువులిద్దరూ. మమతను పెంచుకొని మమకారాన్ని వదిలి వేయాలన్నారు స్వామి. గీతాచార్యుడు చెప్పిన బోధ కూడా ఇదే. దైనందిన జీవితంలో కేవలం గీతా పారాయణం ఎన్ని పర్యాయాలు చేసినా అది దండగేనన్నారు సత్యసాయి. గీతలో కనీసం ఒక శ్లోకాన్నైనా అర్థం చేసుకొని ఆచరించిననాడు కొంత ప్రయోజనం సాధించినట్లే నన్నారు బాబా. చదువగా, చదువగా, కొన్ని శ్లోకాల్లోని భావాన్ని గ్రహించి నిత్యజీవితంలో ఆచరిస్తే అదే భగవంతుడికి మీరు సమర్పించే కానుక అంటారు సాయి. పుస్తకంలోని విషయాలు మస్తిష్కంలోనికి చేర్చుకుంటే సరిపోదు. ఆచరణ ప్రధానమన్నదే బాబా ఉవాచ. గీతాసారాన్నంతా ఉపన్యాసాల రూపంలో సులభశైలిలో బాబా మనకందించారు. అందుచేత ఆ ఉపన్యాసాలలోని సారాంశం గ్రహించి నిత్యజీవితంలో అనుభవానికి తెచ్చుకొని ఆనందిస్తూ పలువురికి సత్సంగాల ద్వారా తెలియజేయాలని బాబా భక్తుల్ని కోరారు. ఒక్క గీతయే కాదు అనేకానేకాంశాలు బాబా బోధించిన వాటిని స్త్రీలు, పురుషులు, పిల్లలు, వృద్ధులు

చక్కగా ఆచరించి జీవితాల్ని సుఖమయం గావించు కోవాలన్నదే బాబా వారి ఆశయము. భగవద్గీతలో "యత్రయోగేశ్వర కృష్ణ" అన్న శ్లోకం నిష్ఠగా పఠిస్తే భగవద్గీత చదివినట్లే అంటారు విశ్వంజీ. ఈ ఏకశ్లోకి గీతను విశ్వమందిరంలోనికి వెళ్ళగానే మనకి దర్శనమిస్తుంది.

భగవద్గీతలో నిత్య జీవితంలో మానవాళి అధ్యాత్మ సాధన సాగించడానికి తోడ్పడే చిట్కాల వంటివి. కర్మమయ మైన ఈ జీవితాన్ని భక్తితో ముడిపెట్టుకొని, జ్ఞాన సముపార్జన కొరకు పాటుపడి అజ్ఞానమనే అంధకారాన్నుంచి, విజ్ఞాన, సుజ్ఞాన, ప్రజ్ఞానాలవైపు దృష్టి సారించి జీవితమనే ప్రయాణాన్ని కొనసాగించాలి. నామమనే నౌక నాధారం చేసుకొంటే ప్రయాణం సుగమమవుతుంది.

**చిక్కినట్లే చిక్కి చేజారిపోయేను**
**చిక్కులెన్నో పెట్టి చిక్కకుండు**
**భక్తి పట్టు పట్ట భద్రముగ చిక్కేను**
**శాంతి ప్రేమదాయి! సత్యసాయి!** (శాం॥ప్రే॥42)

(సశేషం)

***(కీ.శే. వి. రత్నమోహిని రచించిన విశ్వ హృదయార్చన నుండి సేకరణ)***

**గమనిక**

చందాదారులు తమ సభ్యత్వాన్ని సకాలంలో పునరుద్ధరించుకోవాలి. తమ రచనలను, చందాను (మనీ ఆర్డరు ద్వారా కాని, బేంకు చెక్కు ద్వారా కాని) ఈ దిగువ అడ్రసులకు **విశ్వమాన సమైక్యతా సంసత్** (Viswamanava Samaikyata Samsat) 'విశ్వమందిరం', 3వ లైను, కృష్ణనగర్, గుంటూరు - 522 006. వెబ్‌సైట్ : www.viswaguru.com లేక పి. రామగోపాలరావు (P. Ramagopala Rao), 3-5-1092/2, వెంకటేశ్వర కాలనీ, నారాయణగుడ, హైదరాబాదు - 500 029, Phone : 040-24755674. పంపవలెను. K.K. Gupta, Cell : 9848414585, kkguptaca@gmail.com ఇదే అడ్రసుకు 'విశ్వసూక్తము' అందని చందా దారులు తెలుపవలెను.

# ఆత్మబంధువు

## విశ్వగురుచరితామృతం

(గత సంచిక తరువాయి)

ప్రతిరోజు పూజచేసి మధ్యాహ్నం పన్నెండు గంటలకు, సాయంత్రం 7 గంటలకు స్వామీజీ హారతి ఇచ్చేవారు. ఆకుల కోటేశ్వరరావు గారు రాత్రి 9 గంటలకు తమ షాపు కట్టేసి మాస్టరు గారి దగ్గరకు వచ్చేవారు. తమ స్కూటరు మీద స్వామీజీని ఎక్కించుకొని ఆనంద తీర్థ అగ్రహారం వెళ్ళి అక్కడ ఆయన్ను స్వగృహంలో దింపి తమ ఇంటికి వెళ్ళుతుండేవారు. కోటేశ్వరరావు గారు స్వామీజీని సేవించే విధం చూస్తుంటే ఇట్లాగే ఆంజనేయ స్వామి రాముల వారిని సేవించి ఉండేవాడని అనిపించేది. ఆయన సతీమణి కామేశ్వరి స్వామీజీ మీద చూపిస్తున్న భక్తి శ్రద్ధలకూ, వినయ, విధేయతలకూ, ఆ అభిమానానికీ అవధులుండేవి కావు.

1986 జనవరిలో స్వామీజీ షిర్డీ యాత్ర తలపెట్టారు. బస్సు మాట్లాడటం జరిగింది. భక్తులంతా తమ తమ సీట్లు కేటాయించుకొన్నారు. ఒక భక్తుడు రాలేకపోతే, ఒక సీటు ఖాళీగా ఉందిరమ్మని పిలిస్తే, అదృష్టం పండి, ఈశ్వరికి యాత్రకు పోదామని బుద్ధి పుట్టి స్వామీజీ దగ్గరకు వచ్చింది. అదే ఆమె మొట్టమొదటి సారిగా మాస్టరు స్వామీజీని చూడటం. ఆమె స్వామీజీకి నమస్కరించి యాత్రకు బయలు దేరటానికి అనుజ్ఞ తీసుకొంది. యాత్రలో మాస్టరు గారి అనుగ్రహాన్ని సంపూర్ణంగా ఆమె పొందగలిగింది.

షిర్డీ నుంచి గుంటూరుకు తిరిగి వస్తున్నప్పుడు దారిలో ఈశ్వరికి అతిసార వ్యాధి పట్టుకొంది. బాగా నీరసించి పోయి ఆమె కళ్ళలోకి ప్రాణాలు వచ్చాయి. స్వామీజీ తమ చేత్తో విభూతి ఆమె నోట్లోవేసి, బస్సులో ఆమె సీటు ప్రక్కనే ఉన్న ఇనుప కడ్డీ ఒక చేత్తో పట్టుకొని మరొక చేత్తో ఆమె తల మీద ఓదార్పుగా చెయ్యివేసి, ఆ రాత్రి బస్సు ప్రయాణం చేసినంతసేపూ అలా నిలబడి ఉండి, ఆమెలో ఓపిక రావటానికి శక్తి ప్రసారం చేస్తూనే ఉన్నారు. తెల్లవారే సరికి బస్సు 'గాణగాపురం' చేరింది. అంతా సత్రంలో దిగారు. ఈశ్వరికి

విరేచనాలు కావటం ఆగిపోయింది. నీరసం కొంత తగ్గింది. మామూలుగా ఆమె స్నానం చేసి అందరితోబాటు కులాసాగా, నవ్వుతూ, తిరుగుతూ మాట్లాడుతుంటే – రాత్రి ఆమె స్థితి చూచి "ఏ ప్రమాదం ముంచుకొని వస్తుందో? ఇక ఏ పుణ్యక్షేత్రాలు చూడకుండానే నేరుగా గుంటూరు పోవలసి వస్తుందేమో?"నని కీడు శంకించిన వాళ్ళంతా ఆశ్చర్యపోయారు. ఈ సంఘటన వల్ల ఈశ్వరికి "మాస్టరు గారంటే మామూలు మనిషి కాదు – సాక్షాత్తు సాయిదత్త" అనే నమ్మకం బలంగా ఏర్పడింది. మాస్టరు గారు నాకు పునర్జన్మ ప్రసాదించా"రంటుంది ఈశ్వరి ఆనాటి సంఘటన జ్ఞాపకం వచ్చినప్పుడల్లా.

1986లో కోటేశ్వరరావు గారు కృష్ణనగర్ మూడవ లైనులో ఇల్లు కట్టుకొని దానికి "శ్రీ నిలయం" అని పేరు పెట్టారు. గృహ ప్రవేశమై ఇంట్లో చేరిం తరువాత వాస్తు దోషాలేమైనా ఉంటే అప్పుడు మార్పులు–చేర్పులు చెయ్యటం కష్టమౌతుందనీ, ముందుగానే చూపించడం మంచిదనీ, భావించి, స్వామిజీ దగ్గరకు వచ్చి, ఒకసారి తమ ఇంటికి వచ్చిపొమ్మని వాళ్ళు స్వామీజిని అభ్యర్థించారు.

ఆ తర్వాత ఒక రోజు స్వామిజీ అకస్మాత్తుగా కోటేశ్వరరావు గారింటికి వెళ్ళి వాళ్ళ వాకిట్లో కూర్చున్నారు. మాస్టరు గారిని చూడగానే ఈశ్వరికి ఆశ్చర్యం వేసింది. ఛప్పున దగ్గరికి వచ్చి నమస్కారం చేసి "ఇక్కడ కూర్చున్నారేం మాస్టరు గారూ! లోపలికిరండి" అని ఆహ్వానించి లోపలికి తీసుకు పోయింది. అప్పటికింకా మొదటి అంతస్తు వెయ్యలేదు. వాకిట్లో మెట్లుండేవి కావు. దొడ్లోనే ఉండేవి. స్వామిజీ డాబా మీదకు పోయి, మీద వేసుకొన్న శాలువా తీసి క్రింది పరుచుకొని, హాయిగా దాని మీద పడుకొన్నారు. కాసేపు అట్లాపడుకొని లేచి, క్రిందికి దిగి వెళ్ళిపోయారు. ఆ తర్వాత కొన్నాళ్ళకు కృష్ణనగరులోని కోటేశ్వరరావు గారి శ్రీ నిలయంలో, మొదటి అంతస్తు నిర్మించబడి, దాన్ని 'విశ్వమందిరం'గా చేసుకొని విశ్వంజీ గారు అక్కడ నివసించటం మొదలు పెట్టిన తరువాత జరిగిన తమ రెండవ జన్మదినోత్సవ సభలో మాట్లాడుతూ ఆనాడు తాము కోటేశ్వర రావు గారింటికి వచ్చి డాబా మీద తన స్వంత గృహమనుకొన్నట్లు చొరవుగా పడుకొన్న విషయం ప్రస్తావిస్తూ "ఆ రోజు నేను ఇంట్లో తిరుగుతుంటే

ఇదే నా నివాసస్థానమనిపించింది. ఇక మీదట నేనిక్కడే నివసిస్తానని చెప్పడానికే, అట్లా డాబా మీద పడుకొన్నాను. నా కన్న తల్లికి నేనెంత ఋణపడి వున్నానో! అంతగా తల్లి తర్వాత తల్లియైన శ్రీ ఆకుల కోటేశ్వరరావు గారి ధర్మపత్ని ఈశ్వరికి అంతగా ఋణపడి ఉన్నాను. నాకు దేహమిచ్చిన తల్లి ఒకరైతే దేవుడిచ్చిన తల్లి మరొకరు" అన్నారు. స్వామీజీ దయనూ, ప్రేమనూ, అభిమానాన్ని ఇంతగా చూరగొన్న కోటేశ్వరరావు దంపతులు ధన్యులు.

ఆనాడు శ్రీ కృష్ణుడికి యశోద, షిర్డీసాయినాథ్‌కు బైజాబాయి, శ్రీ సత్యసాయిబాబాకు కరణం సుబ్బమ్మల మాదిరిగా స్వామీజీకి ఈశ్వరి కన్న తల్లి కంటే మిన్నైంది. తన కన్న కొడుకు సురేశ్, కన్న కూతురు మాధురిల కంటే మిన్నగా వాత్సల్యాన్ని వర్షిస్తూ, స్వామీజీని నిరంతరం సేవిస్తూ ఉన్నది. ఏకైక నిష్ఠతో కోటేశ్వరరావు దంపతులు స్వామీజీని సాక్షాత్తు దత్త ప్రభువుగా భావిస్తూ సేవించసాగారు. కోటేశ్వరరావు గారి పిల్లలు స్వామీజీ యెడ చూపిస్తున్న భక్తి అందరికీ ఆశ్చర్యం కలిగించేది. స్వామీజీ కూడా వాళ్ళంటే ఎంతో ప్రేమ చూపించేవారు. తాము చిన్నప్పుడు వ్రాసిన పాటలన్నీ ఆయననేర్పారు. ఆ పాటలన్నీ వాళ్ళు కంఠస్థం చేశారు. మాధురి ఐతే స్వామీజీని ఒక్క క్షణం కూడా విడిచి ఉండేది కాదు. స్వామీజీ కూడా వాళ్ళను ప్రత్యేకమైన వాత్సల్యంతో చూస్తుండేవారు. అది ఎన్ని జన్మల సంబంధమో!

1988వ సంవత్సరం డిసెంబరులో దత్తజయంతి మహోత్సవాన్ని స్వామీజీ గారు శ్రీనివాసరావు కళ్యాణ మంటపంలో మిగుల వైభవంగా జరిపించారు. ఆ ఉత్సవాలు కాగానే రైలుపేట తమ గదిలో ఉన్న దత్త పాదుకలు శ్రీ మాధవరామ శర్మ గారిచ్చిన శ్రీ చక్రగర్భితమైన చందనపు గుళిక, దత్త విగ్రహం, నరసింహ సరస్వతి స్వామివారి పటం, షిర్డీసాయి బాబా విగ్రహం, పూజా వస్తువులన్ని కృష్ణనగర్ తీసుకొచ్చి, ఈశ్వరికిచ్చి "పూజా గృహంలో పెట్టుకొని పూజిస్తుండ"మని చెప్పారు. రైలుపేటలోని గదికి ఆ రోజు నుండి క్రమక్రమంగా పోవటం తగ్గించారు. రైలుపేటలోని తాము అద్దెకు ఉంటున్న కుప్పా సత్యనారాయణ శాస్త్రి గారి మనుమరాలు రాధిక పెండ్లై, అత్తవారింటికి పోయేదాకా ఆ గది ఖాళీ చేయరాదని ఆయన నిర్ణయం. 1989 మే 18వ

తేది రాధిక పెళ్లైంది. ఆ తర్వాత గురుపూర్ణిమ ఉత్సవాలైన తరువాత రైలుపేట గదిని పూర్తిగా ఖాళీ చేసి, కోటేశ్వరరావు గారి నిలయాన్నే "విశ్వమందిరం"గా జేసుకొని ఆయన నివసించటం మొదలు పెట్టారు. వారి భక్తి భావానికి లొంగి వారి ఇల్లే తమ ఇల్లుగా, "విశ్వమందిరం"గా భావించి స్థిరంగా ఉండటం మొదలుపెట్టారు.

విశ్వమందిరంలో తరచు కవి పండితులు గోష్ఠి ప్రసంగాలు జరుగుతుండేవి. 1987లో ఆత్మద్రష్ట, మహాకవి, మహావాగ్మి డాక్టరు ప్రసాదరాయ కులపతులను సన్మానించారు. ఆ సంవత్సరం నుండి స్వామీజీ మహిమ నలు దశదిశలకు వ్యాపించటంతో కవి పండితులనేకులు స్వామీజీ దగ్గరకు రావడం మొదలైంది. స్వామిజీ మేధావులను ఆకర్షించి, వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించి, ఆకట్టుకొనే విధానం విలక్షణంగా ఉండేది. ఈనాడు దేశంలోని మేధావి వర్గం దేశం అతీగతీ పట్టించుకోకుండా, ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా, తామార్జించిన విజ్ఞానాన్ని సమాజ శ్రేయస్సుకు ధారపోయ కుండా స్వార్థం కోసం వినియోగించుకోవడం పనికి రాదని, మేధావులందరూ భావసమైక్యతతో పాటుపడవలసిన సమయం ఆసన్నమైనదని, కుల, మత, వర్గ, ప్రాంత దేశాతీతంగా విశ్వ మానవ సమైక్యతకు పిలుపునిచ్చారు. స్వామీజీ పిలుపు మేలుకొలుపైంది. మేధావులను జాగృతం చేసింది.

1988వ సంవత్సరం నవంబర్ 11వ తేదీ తాము చేస్తున్న హైస్కూలు ఉపాధ్యాయ పదవి స్వచ్ఛందంగా విరమించుకొని, పూర్తి కాలం తన ధ్యేయ సాధనకై స్వామీజీ కృషి చెయ్యటం ప్రారంభించారు. 1988లో స్వామీజీ గారి 44వ జన్మదినోత్సవం కోటేశ్వరరావు గారింట్లో చాలా నిరాడంబరంగా జరిగింది. స్వామీజీ జరిపించిన మొట్టమొదటి జన్మదినోత్సవం అదే. మాస్టరు గారు పుట్టిన తర్వాత ఎన్నడూ జరుగని జన్మదినోత్సవం ఆనాడక్కడ జరగటం ఒక విశేషం.

1989వ సంవత్సరం మే 18వ తేదీ రాధిక పెళ్లైంది. రాధిక పెళ్ళై అత్తగారింటికి వెళ్ళే వరకూ గది ఖాళీ చేయకూడదని తలచిన స్వామీజీ ఆ సంవత్సరంలో జులైలో గురుపౌర్ణమి ఉత్సవం అయిన వెంటనే గది ఖాళీ చేసి,

పూర్తి కాలం శ్రీ ఆకుల కోటేశ్వరరావుగారి భవనాన్నే విశ్వ మందిరంగా జేసుకొని నివసించటం మొదలుపెట్టారు.

విశ్వమందిరంలో 1990లో జరిగిన స్వామిజీ 46వ జన్మదినోత్సవం చాలా వైభవోపేతంగా జరిగింది. ఆనాటికి శ్రీ ఆకుల కోటేశ్వరరావుగారు స్వామిజీ నివసించడానికి వీలుగా ఒక గది, భక్తులకు ఇంటర్వ్యూ ఇవ్వటానికి వీలుగా మరొక గది, సభలూ – సమావేశాలూ జరగటానికి వీలుగా ఒక వేదిక, హాలు ఉండేటట్లు మొదటి అంతస్థును సుందరాతి సుందరంగా నిర్మింపజేశారు. అప్పటి నుంచి ఒక మాదిరి సమావేశాలు, భజనలు, పూజలూ అక్కడే జరుగసాగాయి. భారీ ఎత్తున జరిపే గురుపౌర్ణమి, దత్త జయంతి మొదలైన ఎన్నో మహోత్సవాలు, స్వామీజీకి అత్యంత విధేయుడు, ముఖ్య శిష్యుడు అయిన అన్నా కృష్ణమూర్తి గారి అభ్యర్థనమేరకు ఆయన కొత్తపేటలో నిర్మించిన “శ్రీ అన్నా శ్రీనివాసరావు కళ్యాణ మండపం”లో స్వామీజీ గారు జరిపిస్తుండేవారు.

1989 మార్చి 5వ తేది తమ 45వ జన్మదినోత్సవ సందర్భంలో స్వామిజీ విశ్వమానవ సమైక్యతా పతాకాన్ని విశ్వ మందిరంలో ఆవిష్కరించారు. షట్చక్రాలతో కూడియున్న మానవ దేహంలో మధ్య స్థానమైన హృదయస్థానంలో, కోటి సూర్య ప్రభా సమానమైన దత్తాత్రేయ మహా మంత్రబీజం “ద్రాం” ప్రకాశిస్తూ ఉంటుందన్న విషయాన్ని వెల్లడించేటట్లు షట్చక్రమధ్యస్థంగా “ద్రాం” ఉండేటట్లు ఒక పతాకాన్ని తయారుచేశారు. సత్యం, శీలం, పవిత్రత, సమైక్యత మానవుని ధ్యేయాలని చాటే విధంగా నాలుగు మూలల్లో ఆ నాల్గింటిని వ్రాయించారు.

(సశేషం)

**(కీ॥శే॥ కె.నరసింహ, ఐ.పి.ఎస్. రిటైర్డ్ సంకలనం చేసిన ‘ఆత్మబంధువు’ నుండి సేకరణ)**

# ఊహించ వీలుకాని భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయి అద్భుత లీలలు

- శ్రీ జి.వి.సుబ్బారావు

## శిరిడి సాయి సత్యసాయిల అనుబంధం - ప్రథమ భాగం

మన అలోచనలు సమస్తం (భూత భవిష్యత్ విశేషాలన్నీ) బాబాకు తెలుసు అన్న విషయాన్ని బాబా భక్తులు ఎందరో పలుమార్లు తెలియజేసారు. ఈ సందర్భంగా నా ఒక అనుభవం పాఠకులకు నివేదిస్తున్నాను.

చాలా ఏండ్లుగా శిరిడిని దర్శించాలన్న కోరిక చాలా తీవ్రంగా ఉండేది. శిరిడివెళ్ళి సాయిని దర్శించాలని చాలా ప్రయత్నాలు చేసాను. ఒకసారి న్యూయార్క్ నుండి కుటుంబసమేతంగా ముంబాయి వచ్చాము. అచ్చటినుండి శిరిడి వెళ్ళాలను కున్నాము. సాంతాకృజ్ విమానశ్రయంలో దిగి, అచ్చట భుజించిన ఆహారం సరిపడక మా అందరికి కడుపు నెప్పి కలగడంవలన శిరిడీకి వెళ్ళలేకపోయాము.

ప్రశాంతినిలయం ప్రధాన భజనమందిరంలో చాలా ఎత్తైన శిరిడి సాయి అత్యంత ప్రకాశవంతమైన రజిత విగ్రహాన్ని చూస్తూ ఉన్నప్పుడు సంభవించిన సంఘటన మదిలో మెదలసాగింది. అంతే కాక శిరిడి బాబాకు పర్తి బాబాకు సంబంధం ఉందని తెలిపే పలు గ్రంధ విషయాలు గూర్చి కూడా ఆలోచించడం ప్రాంభించాను. సాయి సాహిత్యంలో ఈ సంబంధం గూర్చి పలు ప్రస్తావనలు కనిపిస్తాయి. కాసేపు శిరిడిసాయి విగ్రహం ముందు కన్నులు మూసుకొని, శిరిడి సాయి రూపాన్ని మనసస్సులో నిలుపుకొని నిలబడ్డాను. ఆశ్చర్యకరంగా పర్తి బాబా నా ముందు నిలబడినట్లు భావన కలిగింది. నా కన్నులు పూర్తిగా తెరిచే వరకు స్వామి నిలబడి ఉన్నారు. అనందంతో చిన్న బిడ్డ వలె స్వామి మృదువైన పాద కమలాలను పట్టుకొని ఉండిపోయాను. స్వామి నన్ను ఇంటర్వ్యూ గదిలోనికి రమ్మన్నారు. చూస్తుండగానే వివిధ రంగుల శిరిడి సాయి వెండి ఉంగరాన్ని సృష్టించి ఈయనే నేను అన్నారు. ఆశ్చర్యంలో మునిగి కాసేపటికి తెప్పరిల్లి నా చిరకాల వాంఛ నెరవేరిందని అనగలిగాను.

# వార్తలు - విశేషాలు

వాషింగ్టన్ ప్రాంతంలో పర్యటన ముగించుకుని జులై 13న స్వామి తిరిగి అట్లాంటా వచ్చారు. ఈ సంవత్సరం గురుపూర్ణిమ ఉత్సవాలు అట్లాంటాలో స్వామి సమక్షంలో జరపడానికి స్వామి అనుగ్రహించడం వలన అక్కడ అత్యంత వైభవంగా కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. జులై 15 వ తేదీ సాయంత్రం అట్లాంటాలోని కమ్మింగ్ ప్రాంతంలో ఉన్న శివా ఇన్సిట్యూట్ ఆఫ్ డాన్స్ ప్రాంగణంలో స్వామికి పాదపూజ ఎంతో శ్రద్ధతో భక్తులు చేసుకున్నారు. ఆ రోజు స్వామి ఆదేశం ప్రకారం 'యువతా దినము'గా పరిగణించి యువతి యువకులు అనేక కార్యక్రమాలు చేసారు. కొందరు పాటలు పాడారు, కొందరు నృత్యం చేసారు, కొందరు మాట్లాడారు. ఆ విధంగా స్వామి యువతకు ప్రాముఖ్యత ఇచ్చి వారిలోని కళానైపుణ్యాన్ని ప్రదర్శించడానికి చక్కని అవకాశం కల్పించారు.

జులై 16 నాడు డులుత్ ప్రాంతంలోని రాధాకృష్ణ ఆలయ ప్రాంగణంలో ఉదయం భక్తులు సామూహికంగా దత్తవ్రతం స్వామి సన్నిధిలో చేసుకున్నారు. సాయంత్రం ఆ నాట్యసంస్థలో నృత్యం నేర్పే గురువును, ఆ ప్రాంత పోలీస్ అధికారిని స్వామి సత్కరించారు. తవాత తమ దివ్యసందేశమును అందించారు. (ఆ సందేశం ఈ సంచికలో ఇవ్వబడింది). భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందారు. జులై 24 నాడు అట్లాంటా నుండి బయలుదేరి ఫ్లోరిడా చేరుకున్నారు. అక్కడ రెండు రోజులు ఉండి భక్తులకు దర్శనము, ఆశీస్సులు అనుగ్రహించి జులై 26 నాడు నార్త్ కెరొలీనాలో చార్లెటి నగరానికి చేరుకున్నారు. అక్కడ భక్తులకు దర్సన సంభాషణములను అనుగ్రహంచి రాలె నగరానికి జులై 29నాడు చేరుకున్నారు.

---

## సత్యసాయి సూక్తులు

**లోభమునకు సాటియైన వ్యాధి మరి ఒక్కటి లేదు**
**క్రోధమునకు సాటియైన శత్రువు వేరొకటి లేదు.**

**దారిద్ర్యమును మించిన దుఃఖం-మరొకటి లేదు**
**జ్ఞానమును మించిన సుఖం-మరొకటి లేదు.**

# గీతమంజరి

ప్రాణికోటు లన్నమునీరుఁ బడయకున్న
విగతజీవంబు లగుటలో వింతయేమి
ప్రాణములు లేని యావిరియంత్ర మైన
నీరు లేకుండ నడువదు నిముషమేమి

పుట్టి పెరిగినచోటను బూరుషునకు
నధికగౌరవ ముండుట యది సుమ్ము
జన్మ మొందిన యాప్రదేశంబులందు
నేళ్లు సన్నమైయుండుట యెఱుగమొక్కొ

మింటఁ జుక్కలు లెక్కకు మించియున్న
నందులోఁ  జంద్రుఁ డొక్కఁడే యలరుచుండు
క్ష్మాతలంబున నెందఱో మనజులుందు
రందులో నుండునట్టి మహాత్ముఁ డొకఁడె

కఠినశీలు రయ్యును దగుకాలమందు
యోగ్యులగువారు నమ్రులై యుపచరింత్రు
ఇతరకాలంబులందుఁ దా నెట్టులున్నఁ
గరము వంగి కార్యముసేయుఁ గార్ముకంబు.

**(కీ॥శే॥ చిలకమర్తి నరసింహము గారు రచించిన 'గీతమంజరి' నుండి సేకరణ)**